నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్
శుక్రవారం | అక్టోబర్ 11, 2024 | www.navatelangana.com

బతుకమ్మ ప్రత్యేక గీతం సీడీ ఆవిష్కరణ

నవతెలంగాణ-జైపూర్

తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలకు నిలువెత్తు నిదర్శనం బతుకమ్మ అని సింగరేణి సీఎండీ ఎన్.బలరామ్ అన్నారు. బతుకమ్మ ప్రత్యేక గీతాన్ని గురువారం హైదరాబాద్‌లో ఆవిష్కరించారు. సింగరేణి కాలరీస్ ఆధ్వర్యంలో బతుకమ్మ ప్రత్యేక గీతాన్ని రూపొందించినట్లు తెలిపారు. బతుకమ్మ ఔన్నత్యాన్ని తెలిపేలా అద్భుతమైన గీతాన్ని రాసిన ప్రజాకవి, సింగరేణి ఉద్యోగి జయరాజ్‌ను ఆయన అభినందించారు. సింగరేణి వ్యాప్తంగా బతుకమ్మ సంబురాలకు యాజమాన్యం విస్తృతమైన ఏర్పాట్లు చేసిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జీఎం కో ఆర్డినేషన్ సీపీఆర్వో ఎస్‌డీఎం సుభాని పాల్గొన్నారు.



డీఎస్సీ ఎంపిక జాబితాను సవరించాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఇటీవల విడుదల చేసిన డీఎస్సీ ఎంపిక జాబితాలో జరిగిన తప్పులను సవరించాలని పిఆర్టియుటిఎస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కృష్ణకుమార్, నరసింహస్వామి కోరారు. ఈ విషయమై గురువారం జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో వినతిపత్రం అందించారు. ఎంపిక జాబితాలో పలు తప్పులు జరిగాయని, ఈ తప్పులతో అభ్యర్థులకు అన్యాయం జరిగిందని పేర్కొన్నారు. బాధిత అభ్యర్థులకు న్యాయం చేయాలని విన్నవించారు. అలాగే డీఎస్సీ నియామకాల కౌన్సెలింగ్‌లో బదిలీకాని ఉపాధ్యాయుల స్థానాలను చూపాలని కోరారు. గతంలో బదిలీ అయిన ఉపాధ్యాయులను రిలీవ్ చేసిన తర్వాత డీఎస్సీ నియామకాల కౌన్సెలింగ్ తర్వాత ఖాళీ స్థలాన్ని బట్టి భర్తీ చేయాలని కోరారు.



తగ్గని జ్వరాల తీవ్రత..!

- అధికంగా నమోదవుతున్న అతిసారం..జ్వరాలు
- గతం కంటే భారీగా పెరిగిన డెంగ్యూ కేసులు
- వర్షాకాలం ముగిసినా తగ్గుముఖం పట్టని వైనం

జిల్లాలో జ్వరాల తీవ్రత తగ్గుముఖం పట్టడం లేదు. ఇంటికొకరు చొప్పున మంచం పడుతున్న సంఘటనలు కనిపిస్తున్నాయి. జులై, ఆగస్టులో కనిపించిన తీవ్రత సెప్టెంబర్‌లోనూ అదే స్థాయిలో పునరావృతమవుతోంది. రిమ్స్ ఆస్పత్రితో పాటు పీహెచ్‌సీలకు సైతం జ్వర బాధితులు చికిత్సల కోసం వరుస కడుతున్నారు. రిమ్స్ ఆస్పత్రిలో 500పడకల సామర్థ్యం ఉండగా ప్రస్తుతం 700మంది వరకు చికిత్సలు తీసుకుంటున్నారు. వీరికి అదనంగా రోజూ 2వేల మంది వివిధ జ్వరాలతో బాధపడుతూ రిమ్స్ బయటి రోగుల విభాంలో చికిత్సలు తీసుకుంటున్నారు. ప్రస్తుతం వర్షాకాలం తగ్గుముఖం పట్టినా.. జ్వరాల తీవ్రత మాత్రం తగ్గకపోగా..మరింత పెరగడం ఆందోళనకు దారితీస్తోంది. మరోపక్క గతంలో ఎన్నడూ లేని విధంగా జిల్లాలో డెంగ్యూ జ్వరాలు పెరగడం కలకలం రేపుతోంది. ఈ ఏడాది ప్రారంభం నుంచి ఇప్పటి వరకు ఏకంగా 16,393మంది వివిధ రకాల జ్వరాల భారినపడినట్లు వైద్యఆరోగ్యశాఖ అధికారులు చెబుతున్నారు.



నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

ఆదిలాబాద్ జిల్లాలో ప్రతి ఏటా వర్షాకాలం సీజన్‌లో జ్వరాలు ప్రబలడం సాధారణంగా మారుతోంది. ఏడాకాలం సైతం జ్వరాలు నమోదవుతున్నా..వర్షాకాలం రాగానే విజృంభిస్తున్నాయి. వాతావరణ మార్పులు, కలుషిత నీటి ప్రభావం, అపరిశుభ్రత కారణంగా దోమల వృద్ధి పెరిగిపోవడం వంటి కారణాలతో జ్వరాల తీవ్రత అధికంగా నమోదవుతోంది. వైద్యఆరోగ్యశాఖ ద్వారా పలు గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహించడం, ఇంటింటి జ్వర సర్వే చేపట్టడం వంటి ప్రక్రియలు చేపట్టినా పూర్తిస్థాయిలో అదుపులోకి రాని పరిస్థితి కనిపిస్తోంది. జిల్లాలో వివిధ రకాల జ్వరాల సంఖ్య అధికంగా ఉన్నా అతిసారం, శ్వాసకోశ వ్యాధులు(జలుబు,దగ్గు వంటివి) సైతం భారీగా నమోదయ్యాయి. ఈ ఏడాది జనవరి నుంచి సెప్టెంబర్ వరకు అతిసారం కేసులు 13,473 నమోదు కాగా వివిధ రకాల జ్వరాలు 16,393 వరకు నమోదయ్యాయి. వీటితో పాటు శ్వాసకోశ వ్యాధులు 4024 వరకు నమోదు కావడం గమనార్హం. ఇలా వేలాది మంది జ్వరాలతో బాధపడుతుండగా.. ప్రభుత్వ, ప్రయివేటు ఆస్పత్రులు రోగులతో కిటకిటలాడుతున్న పరిస్థితులు కనిపిస్తున్నాయి.

మరింత పెరిగిన డెంగ్యూ కేసులు

జిల్లాలో ఈ ఏడాది డెంగ్యూ కేసులు పెరగడం కలకలం రేపుతోంది. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ తరహా జ్వరాలు నమోదు కావడంతో బాధితులు ఆందోళనకు గురవుతున్నారు. జిల్లాలో 2022లో 207 డెంగ్యూ కేసులు నమోదు కాగా 2023లో వీటి సంఖ్య తగ్గిపోయి 108మాత్రమే నమోదయ్యాయి. కానీ ఈ ఏడాది 2024లో మాత్రం మళ్లీ డెంగ్యూ జ్వరాలు విజృంభించడం చర్చనీయాంశంగా మారింది. ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటి వరకు ఏకంగా 331 కేసులు నమోదుకావడం పరిస్థితి తీవ్రతను తెలియజేస్తోంది. అనేక మంది జ్వర బాధితులకు ప్లేట్‌లేట్ల సంఖ్య తగ్గిపోవడంతో రోజుల తరబడి ఆస్పత్రుల్లో చికిత్సలు తీసుకోవాల్సి వచ్చింది. ప్రభుత్వ ఆస్పత్రుల్లో పడకలు సరిపోకపోవడంతో పాటు మెరుగైన వైద్యం కోసం అనేక మంది ప్రయివేటు ఆస్పత్రులను ఆశ్రయించారు. దీంతో సుమారు వారం రోజుల పాటు చికిత్స తీసుకోవడంతో రూ.వేలల్లో ఖర్చు చేయాల్సి వచ్చింది. ఇంకా అనేక మంది ఆస్పత్రుల్లో చికిత్సలు తీసుకుంటుండటంతో జ్వరాల తీవ్రత ఏ స్థాయిలో ఉందో తెలుస్తోంది. అధికారయంత్రాంగం మరిన్ని నివారణ చర్యలు తీసుకుంటే జ్వరాలు అదుపులోకి వచ్చే అవకాశం ఉంటుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

నివారణ చర్యలు తీసుకుంటున్నాం : డా.నరేందర్ రాథోడ్, ఇన్‌చార్జి డీఎంహెచ్‌ఓ



జిల్లాలో జ్వరాలను అదుపు చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నాం. వివిధ శాఖల సమన్వయంతో డ్రైడే కార్యక్రమం చేపడుతున్నాం. జ్వరాలు అధికంగా ప్రబలిన ప్రాంతాలను గుర్తించి అక్కడ స్ప్రే చేయించడం వంటి చర్యలు చేపడుతున్నాం. గిరిజన ప్రాంతాల్లో కళాజాత బృందాలతో అవగాహన కల్పిస్తున్నాం. ప్రయివేటు ఆస్పత్రులకు వచ్చే వారికి డెంగ్యూ అనుమానం ఉంటే రిమ్స్‌లో టెస్టు చేయిస్తున్నాం. గత నెలతో పోల్చితే డెంగ్యూ కేసులు తగ్గుముఖం పట్టాయి.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి



నవతెలంగాణ-మంచిర్యాల

జిల్లా కేంద్రంలో గల ఓ ఇంట్లో పేకాట ఆడుతున్న ఆరుగురిని రామగుండం టాస్క్‌ఫోర్స్ పోలీసులు గురువారం అదుపులోకి తీసుకున్నారు. పట్టణంలోని కాలేజ్ రోడ్‌లో గల ఓ ఇంట్లో డబ్బులు పెట్టి పేకాట ఆడుతున్నారని వచ్చిన నమ్మదగిన సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ రాజుకుమార్, ఎస్ఐ లచ్చన్న కలిసి తమ సిబ్బందితో పేకాట స్థావరంపై దాడి చేశారు. పేకాట ఆడుతున్న ఆరుగురిని అదుపులోకి తీసుకొని వారి వద్ద నుండి రూ.73,470నగదు, 5 మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. పేకాట ఆడుతున్న వారిలో నల్మాస్ సత్తయ్య, అంబటి కిషోర్, బొమ్మెల అంజనేయులు, బిదర్వుల రాజు, పంచాల రమేష్, కాసం సతీష్ ఉన్నట్లు టాస్క్‌ఫోర్స్ పోలీసులు తెలిపారు.

ఆర్థిక సాయం అందజేత



నవతెలంగాణ-వాంకిడి

రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ ఓ పేద యువకుని కుటుంబానికి పోలీసుల ఆధ్వర్యంలో ఎస్ఐ ప్రశాంత్ ఆర్థిక సాయం అందించారు. మండలంలోని ఖిరిడి గ్రామానికి చెందిన రాయిసిడాం అరుణ్ కుమార్ ఇటీవల గోయేగాం గ్రామ సమీపంలోని జాతీయ రహదారిపై ద్విచక్ర వాహనం అదుపుతప్పి కింద పడడంతో తీవ్రంగా గాయపడ్డాడు. ప్రస్తుతం మంచిర్యాల ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. దీంతో ఎస్ఐ ప్రశాంత్ గురువారం పోలీస్‌స్టేషన్‌లో ఆయన కుటుంబానికి అండగా నిలబడి వైద్య చికిత్స నిమిత్తం రూ.15వేలు అందించారు. దీంతో బాధిత కుటుంబ సభ్యులు ఎస్సై ప్రశాంత్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

సౌండ్ బాక్సుల పంపిణీ



నవతెలంగాణ-వేమనపల్లి

బతుకమ్మ పండుగ సంబరాల్లో భాగంగా మాజీ జడ్పీటీసీ ఆర్.సంతోష్ కుమార్, కాంగ్రెస్ మండల అధ్యక్షులు సయ్యద్ సాబీర్ అలీ ఆధ్వర్యంలో రూ.11,40,000 విలువ గల సౌండ్ బాక్సులు 40 సెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణలో ప్రత్యేకమైన బతుకమ్మ సంబరాలను ఆడబిడ్డలు సంతోషంగా జరుపుకోవడం కోసం సద్దుల బతుకమ్మ నిమిత్తం 40 సెట్ల సౌండ్ బాక్సులను పంపిణీ చేస్తున్నామని తెలిపారు. నాగారాం గ్రామ పంచాయతీలో కాంగ్రెస్ పార్టీ యువనాయకులు ముల్కల సత్యనారాయణ రూ.2,00,000 విలువ గల 6సెట్ల డీజే సౌండ్ బాక్సులను కొనివ్వడం సంతోషంగా ఉందని అన్నారు. అలాగే నీల్వాయిలో మాజీ సర్పంచ్ గాలి మధు ఆధ్వర్యంలో, ముల్కలపేటలో ఒడిల రాజన్న, కామెర గణేష్ ఆధ్వర్యంలో కొత్త కాలనీ, దస్నాపూర్‌లో మాజీ సర్పంచ్ కుమురం రమేష్, వెంకటేష్‌గౌడ్, రాజేష్ ఆధ్వర్యంలో కొత్తపల్లి, వేమనపల్లిలో మాజీ సర్పంచ్ తోకల రాంచందర్, మాజీ ఎంపీపీ కుర్రు వెంకటేశం ఆధ్వర్యలో రాచర్ల గ్రామాలలో బాక్సులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో చెన్నూరి పురుషోత్తం, చెన్నూరి చందు, మంత్రి రమేష్, నెండుగురి మధుసూదన్, వినోద్‌రెడ్డి, కోడూరి దుర్గయ్య ఇగురం జగన్, ఆవులమారి పున్నం, ఈర్ల మల్లయ్య, సీపెల్లి శ్రీనివాస్ పాల్గొన్నారు.

గోదాంను ప్రారంభించిన అడిషనల్ కలెక్టర్



నవతెలంగాణ-ఖానాపూర్

మండలంలోని మస్కాపూర్ గ్రామంలో గురువారం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన 500 మెట్రిక్ టన్నుల గోదాంను అడిషనల్ కలెక్టర్ ఫైజల్ హైమద్ ప్రారంభించారు. సుమారు రూ.48.89లక్షలతో గోదాం నిర్మాణాన్ని పూర్తి చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిసిసిబి చైర్మన్ భోజారెడ్డి, వైస్ చైర్మన్ ఎర్ర రఘునందన్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ రాజుర సత్యం, మండల అధ్యక్షులు ధోనీకేని దయానంద్, ఖానాపూర్ పిఎసిఎస్ చైర్మన్ ఇప్ప శ్రీనివాస్‌రెడ్డి, సత్తెనపల్లి పిఎసిఎస్ చైర్మన్ ఆమంద శ్రీనివాస్, డైరెక్టర్ పురుషోత్తం యాదవ్, పాండవాపూర్ పిఎసిఎస్ చైర్మన్ రమేష్‌రావు, నాయకులు షబ్బీర్ పాషా, రాంచందర్, సీఈఓ ఆశన్న పాల్గొన్నారు.

అభివృద్ధి విషయంలో వెనుకడుగేసేది లేదు

- నవంబర్‌లో సీఎం చేతుల మీదుగా హాస్పిటల్ పనులు ప్రారంభం
- ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు

నవతెలంగాణ-మంచిర్యాల

నియోజకవర్గ అభివృద్ధి విషయంలో వెనుకడుగు వేసేది లేదని ప్రజల ప్రయోజనాల కోసమే నిర్మాణంలో ఉన్న సమీకృత కూరగాయల మార్కెట్ భవనం కూల్చివేశామని ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు అన్నారు. గురువారం ఐబీ ఆవరణలోని మార్కెట్ యార్డ్ కూల్చివేతలను పరిశీలించారు. ప్రజలకు పనికి రాని మార్కెట్ యార్డ్ భవనాన్ని తొలగించి ఆ స్థలంలో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి, మాతాశిశు ఆసుపత్రి నిర్మాణం చేస్తున్నట్లు తెలిపారు. నవంబర్ మాసంలో ఆసుపత్రి నిర్మాణ పనులు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభిస్తామన్నారు. అభివృద్ధి చూసి ఓర్వలేక ప్రతిపక్షాలు ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారన్నారు. ప్రజలకు మెరుగైన వైద్యం అందించడానికి వైద్యశాల నిర్మిస్తే ప్రతిపక్షాలకు వచ్చిన చిక్కు ఏమిటో అర్థం కావడం లేదన్నారు. హైదరాబాద్, కరీంనగర్, వరంగల్‌కు ఉన్నత వైద్యం కోసం వెళ్లకుండా మంచిర్యాలలో వైద్యం అందించేందుకు కృషి చేస్తుంటే మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు కండ్లు మండుతున్నాయని మండిపడ్డారు. ప్రభుత్వ అతిథి గృహం లేకుండా పోయిందని వాపోవడం విడ్డురంగా ఉందన్నారు. మంత్రులు వస్తే తన ఇంట్లో ఆతిథ్యం ఇస్తానని తెలిపారు. కూరగాయల మార్కెట్లో కొత్త భవనం నిర్మాణం ఎందుకు చేయలేదో దివాకర్‌రావు ప్రజలకు జవాబు చెప్పాలని నిలదీశారు. గోదావరిపై అంతర్గాం బ్రిడ్జి నిర్మాణం స్వార్థంతో చేపట్టింది తప్ప ఒక ప్రణాళిక లేదని ఆరోపించారు. ప్రతిపక్షాలు చేసే ప్రతి ఆరోపణలకు అభివృద్ధి, సంక్షేమం ద్వారా జవాబు చెబుతానని ప్రేమ్‌సాగర్‌రావు తెలిపారు.



సంబురంగా సద్దుల బతుకమ్మ



మంచిర్యాల : బతుకమ్మ ఆడుతున్న మహిళలు



మంచిర్యాల : బతుకమ్మలతో యువతులు



మంచిర్యాల : బతుకమ్మను పేరుస్తున్న మహిళలు

నవతెలంగాణ-మంచిర్యాల

జిల్లాలో సద్దుల బతుకమ్మ వేడుకలు వైభవంగా జరిగాయి. ఊరువాడ, పట్టణాలు బతుకమ్మ పాటలతో మారుమోగాయి. మంచిర్యాల పట్టణంలోని పలు కాలనీలు పూల వనాలను తలపించాయి. గురువారం సద్దుల బతుకమ్మ వేడుకలు జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. కుటుంబ సభ్యులంతా ఒక్క చోట చేరి తీరొక్క పూలతో భక్తి శ్రద్ధలతో బతుకమ్మను పేర్చారు. బతుకమ్మల చుట్టూ ఆడి పాడారు. మహిళలు, యువతులు, చిన్నారులు డ్యాన్స్‌లు చేస్తూ సందడి చేశారు. అనంతరం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన చెరువులు, గోదావరిలో బతుకమ్మలను నిమజ్జనం చేశారు. అనంతరం ఒకరికొకరు వాయినాలు ఇచ్చుకొని వెంట తెచ్చుకున్న సత్తు పిండి పంచి పెడుతూ ఆనందంగా గడిపారు.

జన్నారం : మండలంలోని అన్ని గ్రామాల్లో మహిళలు సద్దుల బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. వివిధ గ్రామాల్లో గ్రామ అధికారులు, నాయకులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఉదయం నుండే మహిళలు రంగు రంగు పూలతో బతుకమ్మలను అందంగా పేర్చారు. కొత్త బట్టలు కట్టుకొని బతుకమ్మలను ఒకచోట చేర్చి పాటలు పాడారు. అక్కడక్కడ డీజే సప్పులతో ఉత్సాహంగా కోలాటాలు ఆడుతూ బతుకమ్మలను సమీప వాగులు, గోదావరిలో నిమజ్జనం చేశారు. బతుకమ్మ సంబరాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్ఐ రాజవర్ధన్ ఆధ్వర్యంలో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు.

జన్నారం : సద్దుల బతుకమ్మ సంబరాల్లో మహిళలు, యువతులు





మంచిర్యాల : బతుకమ్మలను తీసుకొస్తున్న మహిళలు

కంటి ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి



నవతెలంగాణ-నిర్మల్ రూరల్

ప్రస్తుత పరిస్థితుల్లో ప్రతి ఒక్కరూ కంటి ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని డిసిహెచ్ఎస్ డాక్టర్ సురేష్ తెలిపారు. ప్రపంచ దృష్టి దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం మినీ ట్యాంక్ బండ్‌పై గల అంబేద్కర్ విగ్రహం వద్ద ఎల్వీ ప్రసాద్ ముధోల్, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ నిర్మల్ శాఖ, లయన్స్ క్లబ్ నిర్మల్ ఆధ్వర్యంలో చిన్నపిల్లల్లో దృష్టి సంరక్షణ కాపాడుకునేందుకు ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ సర్వేంద్రియానం నయనం ప్రధానం అని పేర్కొంటూ నేటి కాలంలో చిన్న పిల్లలు నుండి యువత వరకు సెల్‌ఫోన్ వ్యసనానికి లోనై తమ అమూల్యమైన సమయాన్ని వృథా చేసుకుంటున్నారని తెలిపారు. సెల్‌ఫోన్‌లతో గడుపుతూ దృష్టి, హ్రస్వ దృష్టి లోపం బారినపడుతున్నారన్నారు. ఫలితంగా కంటి చూపును కోల్పోతున్నారన్నారు. ప్రస్తుత కాలంలో పెద్దవారు పిల్లలకు సమయాన్ని కేటాయించి సమతులమైన పౌష్టికాహారాన్ని అందించాలన్నారు. ఎల్వీ ప్రసాద్ ఆధ్వర్యంలో చేపట్టిన గడపగడపకు కంటి పరీక్షలు కార్యక్రమంలో అందరూ భాగస్వాములై అంధత్వరహిత జిల్లాగా తీర్చిదిద్దాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కృష్ణంరాజు, డాక్టర్ శృతి వాస, ఎల్వి ప్రసాద్ కోఆర్డినేటర్ సాయన్న, నేత్ర వైద్య సహాయ నిపుణులు ఓం ప్రకాష్, లక్ష్మినారాయణ, నెరేళ్ల హన్మంత్, లయన్ చంద్రమోహన్‌రెడ్డి, రవికుమార్‌రెడ్డి, నవీద్ అహ్మద్ నురాని, జ్యోతి, సురేష్, ప్రవళిక, లహరి పాల్గొన్నారు.

ప్రతిభ కనబరిచిన యువతీయువకులకు సన్మానం



నవతెలంగాణ-ఖానాపూర్

మున్నూరు కాపు యువజన సంఘం ఆధ్వర్యంలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన యువతీయువకులను ఘనంగా సన్మానించారు. పట్టణంలోని శ్రీరామ్‌నగర్ మున్నూరు కాపు యువజన సంఘ భవనంలో ఎంబిబిఎస్, ట్రిపుల్ ఐటీ, ప్రభుత్వ ఉద్యోగం సాధించిన యువతీయువకులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ ఉద్యోగాలు సాధించిన మున్నూరు కాపు కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలుపుతూ రానున్న రోజుల్లో మరింత మంది విద్యార్థులు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించి మంచి పేరు తేవాలని తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగాలు సాధించిన గుమ్ముల హరీష్, పెంచాల హరీష్, సంద ప్రవళిక, ఎలిశెట్టి సునీత, ఎంబిబిఎస్ సీటు సాధించిన సంద సౌమ్య, సల్ల అరవింద్, ట్రిపుల్ ఐటీలో సీటు సాధించిన వసుపుల సాహితీ, గుమ్ముల గ్రీష్మసాయిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో మున్నూరు కాపు యువజన సంఘం అధ్యక్షులు గాడ్పు రాజభూషణ్, పెద్ద సంఘం అధ్యక్షుడు వసుపుల నరేందర్, వార్డు కౌన్సిలర్ నాయిని స్రవంతి సంతోష్, యువజన సంఘం నాయకులు తొంటికూరి మణికంఠ, యువజన సంఘం గౌరవ అధ్యక్షులు పాదం రాకేష్, గుమ్ముల రాజేందర్, చిలుకూరి ఇస్తారి, నాయిని రాజేశ్వర్, మాదాసు నాగరాజు, సంద రాకేష్, ఎంశెట్టి రవి, ఎలిశెట్టి రవికాంత్, సల్ల వంశీ, ఎలిశెట్టి వంశీ, అక్షయ్, సాయితేజ పాల్గొన్నారు.

ఒప్పంద పద్ధతిన పోస్టుల భర్తీ

నస్పూర్: తెలంగాణ వైద్య విధాన పరిషత్, జిల్లా ఆసుపత్రుల ప్రధాన అధికారి కార్యాలయ పరిధిలోని ఆసుపత్రుల్లో ఒప్పంద సేవల పద్ధతిన పోస్టులు భర్తీ చేయనున్నట్లు జిల్లా ఆసుపత్రుల ప్రధాన కార్యాలయ పర్యవేక్షకులు డా.కోటేశ్వర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సివిల్ అసిస్టెంట్ సర్జన్ స్పెషలిస్ట్-9, సివిల్ అసిస్టెంట్ సర్జన్-1 పోస్టులను ఒప్పంద సేవల పద్ధతిన మార్చి 31 వరకు/అవసరం మేరకు నియమించడం జరుగుతుందని తెలిపారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్-నిర్మల్
శుక్రవారం | అక్టోబర్ 11, 2024 | www.navatelangana.com

పీఆర్టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులుగా ప్రభాకర్

నవతెలంగాణ-కడెం



మండలంలోని లింగాపూర్ ఉన్నత పాఠశాలలో వ్యాయామ ఉపాధ్యాయులుగా విధులు నిర్వహిస్తున్న నెమలికొండ ప్రభాకర్ పీఆర్టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులుగా ఎన్నికైనట్టు, నిర్మల్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తోట నరేంద్రబాబు, బీవీ రమణరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శామీర్‌పేట్‌లో నిర్వహించినటువంటి రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ఈ ఎన్నిక జరిగినట్టు తెలిపారు. రాష్ట్ర ఉపాధ్యక్షులుగా ఎన్నికైన ప్రభాకర్‌కు రాష్ట్ర అసోసియేషన్ అధ్యక్షులు కోట వేణు, మండల పీఆర్టీయూ అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు వెంకటరమణ, మహేష్, ప్రధానోపాధ్యాయులు బి.వెంకటరమణ శుభాకాంక్షలు తెలియజేసి అభినందించారు.

ఎయిడ్స్ నివారణలో భాగస్వాములు కావాలి

నవతెలంగాణ-నిర్మల్‌రూరల్



హెచ్‌ఐవీ నివారణలో స్వశక్తి సంఘాల మహిళలు భాగస్వాములు కావాలని నిర్మల్ మండల ఐకేపీ ఏపీఎం బోస్ అన్నారు. మండలంలోని రత్నాపూర్ కాండ్లి గ్రామంలో గ్రామ సంఘం మహిళలకు హెచ్‌ఐవీ వ్యాప్తి నివారణ చర్యలపై జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా బోస్ మాట్లాడుతూ హెచ్‌ఐవీ వైరస్‌ని పూర్తిగా అంతం చేసే మందులు రాలేదని, కేవలం అదుపు చేసి, జీవిత కాలన్ని పెంచడానికి మాత్రమే మందులు అందుబాటులో ఉన్నాయన్నారు. నివారణ చర్యలు ప్రతి ఒక్కరూ పాటిస్తే ఎయిడ్స్ దరిచేరదన్నారు. కార్యక్రమంలో ఐకేపీ సీసీ కిరణ్మయి, వీఓ నర్సయ్య, గ్రామాఖ్య అధ్యక్షురాలు సంతోషా, కోశాధికారి సల్మా బేగం, కార్యదర్శి మమత, ఐసీటీసీ, డీఎస్ఆర్‌సీ కౌన్సిలర్లు సుదర్శన్, శ్రీనివాస్, మహిళా సంఘాల నాయకురాలు పాల్గొన్నారు.

సారంగాపూర్ మార్కెట్ కమిటీ చైర్మెన్‌గా అబ్దుల్ హదీ నియామకం

నవతెలంగాణ-సారంగాపూర్



సారంగాపూర్ మార్కెట్ కమిటీ చైర్మెన్‌గా అబ్దుల్ హదీని నియమిస్తూ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. నిర్మల్ డీసీసీ అధ్యక్షులు శ్రీహరిరావు తమ అనుచరులకు నియమించాలని సూచించినట్టు తెలిసింది. ఆయన సూచన మేరకు సారంగాపూర్ చైర్మెన్‌గా అబ్దుల్ హదీ నియామకమయ్యారు.

సారంగాపూర్ మార్కెట్ కమిటీ పాలకవర్గం

చైర్మన్‌గా అబ్దుల్ హదీ, వైస్ చైర్మెన్‌గా ఎల్.శంకర్‌రెడ్డి, సుభాష్ రెడ్డి, సాద ప్రశాంత్, రాథోడ్ పుష్ప, కొత్తకాపు పోతారెడ్డి, నేరడిగొండ శ్రీనివాస్, తాటి మహిపాల్, శీల సాయినాథ్, అహ్మద్ ముక్తార్, ఆత్రం నాగోరావు, ట్రేడర్స్ నుంచి పడిగెల కేదార్‌నాథ్‌లను నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. తాజాగా నియామకాలతో కాంగ్రెస్ వర్గాల్లో హర్షం వ్యక్తమవుతోంది.

రైతులకు సాగునీరందించాలి

- రేనోవేషన్ ఆఫ్ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే



నవతెలంగాణ-లోకేశ్వరం

రైతులకు సాగునీరందించాలని ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ అన్నారు. గురువారం మండలంలోని కనకాపూర్ లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్ రెనోవేషన్ ఆఫ్ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రైతులను దృష్టిలో పంటకు ఎప్పటికప్పుడు సాగు నీరందించాలని అన్నారు. రేనోవేషన్ కోసం రూ1.42 లక్షలు ప్రభుత్వం నుంచి మంజూరు చేయించానన్నారు. ఈ కార్యక్రమంలో లిఫ్ట్ ఇరిగేషన్ కనకాపూర్ చైర్మెన్ రాజరెడ్డి, భైంసా మార్కెట్ మాజీ చైర్మెన్ రాజేష్ బాబు, ఇరిగేషన్ డిపార్ట్‌మెంట్ డీఈ, జేఈలు రైతులు, బీజేపీ మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ ఉద్యోగాలు సాధించిన యువతకు సన్మానం



నవతెలంగాణ-నేరడిగొండ

ఇటీవల వెలువడిన డీఎస్సీ ఫలితాల్లో ఉద్యోగాలు సాధించిన మండలంలోని వడూర్ గ్రామానికి చెందిన ఆదుముళ్ల విద్యాసాగర్, చొక్కపెల్లి శివ కుమార్, ద్యావంతు సుమన్‌లకు గురువారం మండల కేంద్రంలోని ఎమ్మెల్యే నివాసంలో బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. వారు ప్రభుత్వ పాఠశాలలో చదివి ఉద్యోగాలు సాధించినందుకు అభినందించారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ అంబేకర్ పండరీ, సీనియర్ నాయకులు భూషణ్ పాల్గొన్నారు.

మున్నూరు కాపు సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక



నవతెలంగాణ-బజార్‌హత్నూర్

మండల కేంద్రంలోని మున్నూరు కాపు సంఘ భవనంలో బుధవారం దసరా ఉత్సవాలను పురస్కరించుకొని బజార్‌హత్నూర్ మున్నూరు కాపు సంఘం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఆడహాక్ కమిటీ సభ్యులు ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా నాగభూషణ్, ఉపాధ్యక్షులుగా సూది వినాయక్, ఓర్సీ సంతోష్, కార్యదర్శిగా చట్ల వినీల్, కోశాధికారిగా ఓర్సీ వెంకటరమణ, కమిటీ సభ్యులను, సలహా సభ్యులను ఎన్నుకున్నట్టు వారు పేర్కొన్నారు.

గ్రామంలో హైమాస్ట్ లైట్లతో వెలుగులు

నవతెలంగాణ-బోథ్



గ్రామాల్లో హైమాస్ట్ లైట్లు ఏర్పాటు చేసి వెలుగులు ఇద్దామని ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. గురువారం మండలంలోని ధన్నూర్(బి) గ్రామంలో ఎమ్మెల్యే నిధులతో ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్లను ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం దేవి నవరాత్రుల్లో భాగంగా దుర్గాదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ధన్నూర్(కె) హోమంలో, సేవలాల్ ఆలయాన్ని దర్శించుకొని జగదాంబదేవికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో నారాయణరెడ్డి, శ్రీకాంత్, సురేందర్ యాదవ్, ఎలక రాజు, ప్రవీణ్, రాయల్, రమణ, కృష్ణ, లక్ష్మణ్ పాల్గొన్నారు.

శిథిలావస్థలో తహసీల్దార్ కార్యాలయం

- పట్టించుకోని పాలకులు, ఉన్నతాధికారులు



నవతెలంగాణ-ఖానాపూర్‌టౌన్

ఇది ప్రభుత్వ కార్యాలయమంటే ఎవరైనా నమ్ముతారా..! నమ్మశక్యంగా లేకున్నా నమ్మాల్సిందే.. ఇది ఖానాపూర్ తహసీల్దార్ కార్యాలయం తీరు. కూలిపోయి ఏదైనా ప్రమాదం జరితేనే స్పందించేలా ఉన్న పాలకుల, ఉన్నాధికారుల తీరు ఆశ్చర్యం కలిగిస్తోంది. ఎప్పుడు కూలుతుందో చెప్పలేని ప్రమాదకర స్థితిలో ఉన్న ఈ పాత భవనంలోనే కార్యాలయ నిర్వాహణ జరగడం శోచనీయం. విధులు నిర్వహిస్తున్న అధికారులు మానసికంగా అస్థిరమైన ఆలోచనతో పనిచేస్తున్నారు. శిథిలావస్థలో కార్యాలయం కండ్ల ముందే కనిపిస్తున్నా పాలకులు, ఉన్నతాధికారులు పట్టించుకోక పోవడం గమనార్హం.

నైజాం కాలం నాటి భవనం...

నైజాం కాలంలో నిర్మించిన భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరింది. ఎప్పుడు కూలుతుందో తెలియని దుస్థితిలో ఉంది. వరండా పైకప్పు కూలి కన్నాలు ఎర్పడ్డాయి. తలుపులు, కిటికీలు దెబ్బతిన్నాయి. పైకప్పుపై పిచ్చి మొక్కలు పెరిగి పాడు బడ్డ భవనంలా కనిపిస్తోంది. స్వరాష్ట్రం ఏర్పడి పదేండ్ల గడిచినా కొత్త కార్యాలయం నిర్మించకపోవడం పాలకుల పనితీరుకు అద్దం పడుతోంది.

సమస్యగా మారిన ఫైళ్ల నిర్వాహణ...

ఈ కార్యాలయంలో విధులు నిర్వహించడం ప్రమాదకరం అయినప్పటికి అధికారులు, సిబ్బంది సర్దుకు పోతున్నారు. కాని కార్యాలయంలో ఫైళ్ల నిర్వాహణ సమస్యగా మారినట్లు చెబుతున్నారు. పూర్తిగా పాత బడిన భవనం కావడంతో దస్తావేజులు, కంప్యూటర్ సిస్టమ్‌లకు చెదలు, ఎలుకలు చొరబడే ప్రమాదం ఉంది. వర్షాకాలంలో సమస్య మరింత తీవ్రంగా ఉంటుంది.

ఎమ్మెల్యే దృష్టి సారించాలి...

ఇరవై ఏండ్ల నుంచి తహసీల్దార్ కార్యాలయ భవనం శిథిలావస్థలో ఉంది. అప్పటి నుంచి తాత్కాలిక మరమ్మతులతో సరిపెడుతూ వచ్చారు. ఇప్పుడు మరమ్మతు పనులు చేపట్టినా నిలువలేని స్థితికి చేరింది. స్వరాష్ట్రం ఏర్పడిన పదేండ్ల కాలంలో కూడా గత ప్రభుత్వం కొత్త భవనం నిర్మించలేదు. అప్పటి ఎమ్మెల్యే రేఖానాయక్‌కు అధికారులు, స్థానిక ప్రజలు సమస్యను పలుమార్లు విన్నవించినా పట్టించుకోలేదన్న విమర్శలు ఉన్నాయి. ప్రస్తుత ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ దృష్టి సారించి, నూతన కార్యాలయ నిర్మాణాన్ని చేపట్టాలని కోరుతున్నారు.



మున్సిపల్ కార్యాలయాన్ని సందర్శించిన కలెక్టర్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పట్టణంలోని మున్సిపల్ కార్యాలయాన్ని గురువారం కలెక్టర్ రాజర్షిషా సందర్శించారు. డిజిటల్ ఫ్యామిలీ కార్డు డేటా ఎంట్రీ పనితీరును పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు ఫ్యామిలీ డిజిటల్ కార్డు సర్వే నిర్వహించడం జరిగిందని తెలిపారు. ఫ్యామిలీ డిజిటల్ కార్డు డేటా ఎంట్రీ నమోదు విషయంలో ఎటువంటి పొరపాట్లకు తావివ్వకుండా సక్రమంగా సమాచారాన్ని ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. కుటుంబ ఫొటో ఆన్‌లైన్‌లో తప్పనిసరిగా అప్‌లోడ్ చేయాలని అన్నారు. రేపటిలోగా పూర్తి చేసి నివేదిక సమర్పించాలని, స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ వినోద్ కుమార్, మున్సిపల్ కమిషనర్ ఖమర్ అహ్మద్, ఈడీఎం రవీందర్, ఆపరేటర్స్ ఉన్నారు.



ఏకసభ్య కమిషన్ ఏర్పాటు విరమించుకోవాలి



నవతెలంగాణ-నిర్మల్‌టౌన్

ఎస్సీ వర్గీకరణ కోసం ముఖ్యమంత్రి ఏర్పాటు చేసిన ఏక సభ్య కమిషన్‌ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని జిల్లా కన్వీనర్ బత్తుల రంజిత్ అన్నారు. ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి ఆధ్వర్యంలో గురువారం పట్టణంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం 2014లో ఏర్పాటు అయితే ముఖ్యమంత్రి 2011 ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జనాభా లెక్కల ప్రకారం కులగణన చేస్తాననడం విడ్డూరంగా ఉందన్నారు. జాతీయ కులగణన జరిగిన తర్వాతనే ఎస్సీ కులాలు, ఉప కులాల వారి ఆర్థిక, సామాజిక, విద్య, రాజకీయ, సాంఘిక పరమైన నిర్దిష్ట గణాంకాల లెక్కలు తేలనిదే ఏకసభ్య కమిషన్ రిపోర్టు ద్వారా వర్గీకరణ చేస్తే సహించబోమన్నారు. వర్గీకరణకు అనుకూలంగా ఉన్న ఏ రాజకీయ పార్టీ అయినా రాబోవు రోజులలో బొంద పెడదాతామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ కుంటోళ్ల వెంకటస్వామి, జిల్లా సలహాదారులు ఎ.రాజేశ్వర్, దొంగరి లక్ష్మణ్, టీమ్ జిల్లా అధ్యక్షుడు రాజేశ్వర్, ప్రధాన కార్యదర్శి కె.అడెల్లు, రోడ్డ గంగన్న, అడ్డిగ బోసు, రాజేందర్, పోశెట్టి పాల్గొన్నారు.

బాధితుల పట్ల పోలీసులు గౌరవంగా వ్యవహరించాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్


పోలీస్ స్టేషన్‌కు వచ్చే బాధితుల పట్ల గౌరవంగా వ్యవహరిస్తూ వారి సమస్యలను సత్వరమే పరిష్కరించే దిశగా సిబ్బందికి విధులను కేటాయిస్తూ బాధితులకు న్యాయం చేయాలని ఎస్పీ గౌస్ ఆలం సూచించారు. వార్షిక తనిఖీల్లో భాగంగా గురువారం గుడిహత్నూర్ పోలీస్ స్టేషన్‌ను ఎస్పీ తనిఖీ చేశారు. ముందుగా స్టేషన్ ఆవరణను పరిశీలించి, వాహనాలకు సంబంధించి సిబ్బందికి సూచనలు చేశారు. పోలీస్ స్టేషన్ ఆవరణ పరిసరాలు ఎల్లవేళల పరిశుభ్రతను కలిగి ఉండాలని సూచించారు. అలాగే పోలీసు సిబ్బంది ద్వారా ఏర్పాటు చేసిన గౌరవ వందనాన్ని జిల్లా ఎస్పీ స్వీకరించి, పోలీస్ స్టేషన్ ఆవరణలో ఒక మొక్కను నాటారు. సిబ్బందిచే పరేడ్‌ను నిర్వహించి, సిబ్బంది పరేడ్ ను పరిశీలించారు, అత్యవసర సమయాలలో సిబ్బంది స్పందించే దిశగా చేయాల్సిన సమీకరణలపై స్వయంగా పరిశీలించారు. అవాంఛనీయ సంఘటనలు ఎదురైనప్పుడు సిబ్బంది వాటిని ఎదుర్కొనేలా తీసుకోవాల్సిన డ్రిల్‌ను పరిశీలించారు. సిబ్బంది విధులు, రికార్డుల నిర్వహణ ఎప్పటికప్పుడు నవీకరిస్తూ, పరిశీలిస్తూ, ఉండాలని సూచించారు. పోలీస్ స్టేషన్ సిబ్బంది పనితనాన్ని, పరేడ్‌ను జిల్లా ఎస్పీ స్వయంగా పరిశీలించారు. తదుపరి పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన కేసులు ప్రస్తుత స్థితిగతులు రికార్డుల నిర్వహణ వాటిని పరిశీలించారు.

రోడ్డు భద్రతా నియమాలను పాటించాలి..

గుడిహత్నూర్ పోలీస్ స్టేషన్ జాతీయ రహదారిపై ఉన్నందున ప్రమాదాలు ఎక్కువగా జరిగే అవకాశం ఉందని వాటిని నివారించేందుకు రోడ్డు భద్రత నియమాలను పాటిస్తూ మండల స్థాయిలో ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ముఖ్యంగా గ్రామాలను సందర్శిస్తూ, యువతకు ప్రజలకు ప్రస్తుతం సైబర్ నేరగాళ్లు అవలంబిస్తున్న నూతన విధానాలను సవివరంగా వివరించి, చైతన్య పర్చాలని సూచించారు. మండల స్థాయిలో పూర్తిగా అసాంఘిక కార్యకలాపాలను రూపుమాపాలన్నారు. అదనంగా రాత్రి సమయాల్లో గస్తీ నిర్వహిస్తూ, దొంగతనాలు అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో ఉట్నూర్ డీఎస్పీ సీహెచ్ నాగేందర్, సీఐ భీమేష్, ఎస్సై ఇమ్రాన్ పాల్గొన్నారు.

ఐటీడీఏ ఈఈకి సన్మానం


నవతెలంగాణ-ఉట్నూర్



ఐటీడీఏలో ఈఈగా విధులు నిర్వహిస్తున్న రాథోడ్ భీమ్‌రావు ఈనెల 31న ఉద్యోగ విరమణ పొందనున్నారు. కాగా గురువారం హైదరాబాద్ డిపార్ట్‌మెంట్ సెక్రటరీ శాలువాతో ఘనంగా సన్మానించి, ముందస్తు ఉద్యోగ విరమణ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అధికారులు ఉన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన పీఆర్ ఏఈ

నవతెలంగాణ-నేరడిగొండ



పీఆర్ ఏఈగా గురువారం బాధ్యతలు స్వీకరించిన రాథోడ్ దినేష్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌ని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శాలువా కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ రాథోడ్ సజన్, వీడీసీ చైర్మెన్ రవీందర్‌రెడ్డి ఉన్నారు.

ఉపాధి హామీ కూలీల సంఖ్య పెంచాలి

- జాతీయ గ్రామీణ ఉపాధి హామీ గ్రామసభ



నవతెలంగాణ-లోకేశ్వరం

ఉపాధి హామీ కూలీల సంఖ్య పెంచాలని గ్రామ ప్రత్యేకాధికారి అంజిప్రసాద్ అన్నారు. గురవారం మండలంలోని రాజూర గ్రామంలో 2025-26 సంవత్సరానికి గాను జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం గ్రామసభలో ప్రణాళికా బడ్జెట్ రూపొందించారు. వాటికి సంబంధించిన రైతుల పంట పొలాల్లో చదును చేయడం, పీడర్ చలాన్, గేదెల షెడ్, గొర్ల షెడ్, ఇంకుడు గుంతలు, చెరువులో పూడిక తీత, రైతుల పంట చేనులకు రోడ్లు వేయడం వంటివి చేపట్టేందుకు బడ్జెట్‌లో రూ.1కోటి 33లక్షలు కేటాయించడం జరిగిందని అధికారులు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఈసీ అనిల్, టీఏ రవీందర్, ఎఫ్ఏ ప్రసాద్, పంచాయతీ కార్యదర్శి మహేష్, మాజీ సర్పంచ్ ముత్తగౌడ్, వీడీసీ చైర్మెన్ ప్రవీణ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఎంబీబీఎస్‌లో సీటు సాధించిన విద్యార్థులకు సన్మానం



నవతెలంగాణ-నిర్మల్‌రూరల్

నిర్మల్ పట్టణంలోని ద్యాగవాడకు చెందిన విద్యార్థులు ద్యాగ ఉదయ్ చరణ్, పూదరి నేహా, కొత్వాల్ శివాజీ ఇటీవల విడుదలైన నీట్‌లో ప్రతిభ కనబర్చి ఎంబీబీఎస్‌లో సీటు సాధించారు. ఈ సందర్భంగా శ్రీ ఆంజనేయ మున్నూరుకాపు యువజన సంఘం ఆధ్వర్యంలో వారిని శాలువాతో ఘనంగా సన్మానించారు.

దళారులకు పంటలు అమ్మి నష్టపోవద్దు

- ఎమ్మెల్యే పాయల శంకర్



నవతెలంగాణ-బేల

కష్టపడి పంటలు పండించిన రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చర్యలు చేపడతామని ఎమ్మెల్యే పాయల శంకర్ పేర్కొన్నారు. గురువారం బేలలోని మార్కెట్ యార్డులో సోయా కొనుగోలు కేంద్రాన్ని, మార్కెట్ కమిటీ చైర్మెన్ అశోక్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా ఈ కేంద్రాన్ని ప్రారంభించాయని అన్నారు. రైతులు దళారుల వద్ద పంట అమ్మి మోసపోవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో అధికారులు డీఎం ప్రవీణ్‌రెడ్డి, మార్కెట్ సెక్రటరీ మధుకర్, బీజేపీ మండలాధ్యక్షుడు దత్తా నిక్కం, మాజీ జెడ్పీటీసీ రాందాస్ నాక్లే, పీఏసీఎస్ డోప్టాల చైర్మెన్ భేదొడ్కర్ జితేందర్, సర్పంచులు ఇంద్ర, రాకేష్, భోక్రే శంకర్, సందీప్ ఠాక్రె, నవీన్ పోతరాజ్, మాజీ సర్పంచ్‌లు వట్టిపెల్లి ఇంద్రశేఖర్, రాకేష్ పాల్గొన్నారు.

కష్టపడ్డారు.. కొలువులు సాధించారు..



నవతెలంగాణ-తలమడుగు

ఇటీవల వెలువడిన డీఎస్సీలో ఫలితాల్లో మండలానికి చెందిన పలువురు యువతీ, యువకులు కష్టపడి చదివి, ప్రభుత్వ ఉపాధ్యాయులుగా ఉద్యోగాలు సాధించారు. ఉపాధ్యాయ ఉద్యోగాలు సాధించడం పట్ల గ్రామస్తులు వారి కుటుంబ సభ్యులు ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని కుచులాపూర్ గ్రామానికి చెందిన రాగి సంజీవ్ జిల్లాలో ఎస్టీటీగా ఐదో ర్యాంకు సాధించారు. ఖోడద్ గ్రామానికి చెందిన నల్ల ప్రశాంత్ ఆరో ర్యాంకు సాధించినట్లు తెలిపారు. ఉండం గ్రామానికి చెందిన దేవల్ల ప్రసన్న, కుచులాపూర్ గ్రామానికి చెందిన శివరామకృష్ణ, సుంకిడి గ్రామానికి చెందిన నవనీతారెడ్డి, జిల్లాలో 15వ ర్యాంకు సాధించగా, అదే గ్రామానికి చెందిన శారద, ఉపాధ్యాయులుగా ఎంపిక కావడంతో గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

తాత్కాలికంగా సమ్మె వాయిదా

నవతెలంగాణ-నిర్మల్‌టౌన్

మున్సిపల్ కార్మికులకు ఈనెల 20లోపు వేతనాలు చెల్లిస్తామన్న మున్సిపల్ కమిషనర్ హామీ మేరకు సమ్మె తాత్కాలికంగా వాయిదా వేసినట్టు సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మెన సురేష్ తెలిపారు. కార్మికులకు ఒక నెల వేతనంతో పాటు మిగితా రెండు నెలల వేతనం నుంచి రూ.5వేలు చెల్లిస్తానని హామీ ఇచ్చారు. దీంతో కార్మికులు సమ్మె విరమించారు. ఈ కార్యక్రమంలో ఎన్‌పీఆర్‌డీ జిల్లా అధ్యక్షుడు పసివుద్దీన్, మున్సిపాలిటీ కార్మికులు మల్లేష్, ముత్యం, నరేష్, కిషోర్ పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
కుమురంభీం ఆసిఫాబాద్
శుక్రవారం | అక్టోబర్ 11, 2024 | www.navatelangana.com

రాష్ట్ర స్థాయి పోటీలకు విద్యార్థినుల ఎంపిక

నవతెలంగాణ-ఆసిఫాబాద్



నేటి నుండి రంగారెడ్డి జిల్లా తొర్రూర్‌లో జరిగే 53వ సీనియర్ మహిళల హ్యాండ్ బాల్ పోటీలకు జిల్లాలోని క్రీడా పాఠశాల విద్యార్థినులు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జంగు, జిల్లా ఆశ్రమ పాఠశాల క్రీడా అధికారి మీనారెడ్డి తెలిపారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా జట్టు తరుపున ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు వివరించారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన వారిని జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారిని రమాదేవి, ఏసీఎంఓ ఉద్ధవ్, జీసీడీఓ శకుంతలతో పాటు పలువురు అభినందించారు.

మెడికల్ సీటు సాధించిన విద్యార్థికి సన్మానం

నవతెలంగాణ-కాగజ్‌నగర్



కాగజ్‌నగర్ పట్టణం న్యూకాలనీకి చెందిన డెబ్బటి జాహ్నవి హైదరాబాద్‌లోని ఉస్మానియా మెడికల్ కళాశాలలో సీటు సాధించడం పట్ల ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్‌బాబు హర్షం వ్యక్తం చేశారు. ఆ విద్యార్థిని గురువారం తన నివాసానికి పిలిపించి శాలువాతో సన్మానించారు. డాక్టర్ విద్యను పూర్తి చేసుకొని ఈ ప్రాంతానికి వైద్య సేవలందించాలని ఆమెకు సూచించారు. ఎంబీబీఎస్ సీటు రావడంపై ఆమెను అభినందించి సత్కరించారు. కార్యక్రమంలో నాయకులు కర్ల నానయ్య, పిర్సింగుల తిరుపతి పాల్గొన్నారు.

పురుగులమందు తాగి మహిళ ఆత్మహత్య



నవతెలంగాన-బెజ్జూరు

మండలంలోని సోమిని గ్రామపంచాయతీ పరిధిలోని నందరాం గూడ గ్రామానికి చెందిన వివాహిత గావిడె అమృత(19) పురుగులమందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై విక్రం తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. అమృత కొద్ది నెలలుగా మతిస్థిమితం కోల్పోయి పిచ్చిగా ప్రవర్తిస్తోంది. ఈ క్రమంలో బుధవారం రాత్రి ఇంట్లో ఉన్న పురుగుల మందు తాగింది. కుటుంబ సభ్యులు గమనించి ఆటోలో బెజ్జూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. పరిస్థితి విషమించడంతో వైద్యుల సూచన మేరకు కాగజ్‌నగర్ పట్టణానికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందింది. మృతురాలి సోదరుడు వెంకటేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు. కాగా గురువారం తహసీల్దార్ భూమేశ్వర్ మృతురాలి కుటుంబాన్ని పరామర్శించి వివరాలు సేకరించారు.

అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం పట్టివేత



నవతెలంగాణ-చింతలమానేపల్లి

అక్రమంగా తరలిస్తున్న మూడు క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పట్టుకున్నట్లు ఎస్సై ఇస్లావత్ నరేష్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. బెజ్జూర్ మండలంలోని ముంజంపల్లి, బారెగూడ నుండి అక్రమంగా రేషన్ బియ్యంను ఆటోలో సిర్పూర్-టికు తరలిస్తున్న క్రమంలో పట్టుకున్నట్లు తెలిపారు. బియ్యం తరలిస్తున్న బొడ్డు పద్మ, చెన్నూరి రాముపై కేసు నమోదు చేసి ఆటోని సీజ్ చేసినట్లు ఆయన తెలిపారు.

ఎల్ఓసీ అందజేత



నవతెలంగాణ-కాగజ్‌నగర్

కాగజ్‌నగర్ పట్టణానికి చెందిన జమునకు అత్యవసరంగా కిడ్నీ మార్పిడి ఆపరేషన్ అవసరం కాగా వైద్య పరీక్షల నిమిత్తం ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్‌బాబు రూ. 3 లక్షల ఎల్ఓసీ (లెటర్ ఆఫ్ క్రెడిట్) అందించారు. ఈ ఆపరేషన్ కోసం సీఎంఆర్ఎఫ్ నుండి రూ. 3 లక్షల వరకు సాయం అందుతుందని, బాధితురాలి కుటుంబసభ్యులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఈ సందర్భంగా ఎమ్మెల్యే వారికి భరోసా ఇచ్చారు. హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రిలో కిడ్నీ మార్పిడి ఆపరేషన్లు కూడా చేస్తున్నందున బాధితులు ఈ వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

కుమురం సూరు వర్ధంతిని విజయవంతం చేయాలి

నవతెలంగాణ-కెరమెరి

కుమురం భీం ప్రధాన అనుచరుడు కుమురం సూరు 27వ వర్ధంతిని విజయవంతం చేయాలని కుమురం సూరు ఉత్సవ కమిటీ చైర్మన్ మడావి రాజు కోరారు. గురువారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. ఈనెల 17న ఆదివాసుల ఆరాధ్య దైవం, గిరిజన పోరాటయోధుడు కుమురం భీం 84 వర్ధంతి రోజున కుమురం సూరు వర్ధంతిని జరుపుకోనున్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వం భీం వర్ధంతితో పాటు సూరు వర్ధంతిని అధికారికంగా నిర్వహించనున్న నేపథ్యంలో ఉమ్మడి జిల్లాలోని ఆదిమ జాతి కోలాం తెగల విద్యార్థులు, మేధావులు, మహిళలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో సిడాం ధర్మ, సిడాం ధర్మ, ఆత్రం సోనే రావు, ఆత్రం భీంరావు, భీము పాల్గొన్నారు.

జాతీయ పోటీలకు జిల్లా విద్యార్థిని ఎంపిక

నవతెలంగాణ-ఆసిఫాబాద్

నేటి నుండి ఈనెల 13 వరకు హర్యానాలోని ఫరీదాబాద్‌లో జరిగే తొమ్మిదవ జూనియర్ నేషనల్ సాఫ్ట్ బేస్బాల్ పోటీలకు జిల్లా కేంద్రానికి చెందిన విద్యార్థులు ఎంపికయ్యారు. స్థానికంగా ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం విద్యార్థిని ఎండి సలోమి ఎంపికయ్యారు. మంచిర్యాల జిల్లాకు చెందిన ఇద్దరు విద్యార్థులతో పాటు జిల్లా విద్యార్థిని ఎంపిక కావడం పట్ల పలువురు ఆమెను అభినందించారు.



అనుమతుల అడ్డంకి...

- నిలిచిన జోడేఘాట్ రోడ్డు పనులు
- వర్షాలతో కోతకు గురైన కల్వర్టులు
- ఏటా మరమ్మత్తులే.. పట్టించుకోని అధికారులు, ప్రభుత్వం



జోడేఘాడ్ దారి మధ్యలో వర్షాలకు తెగిన కల్వర్టు



జోడేఘాట్‌కు వెళ్లే దారిలో కంకర తెలిన రోడ్డు

నవతెలంగాణ-కెరమెరి

అటవీపై ఆదివాసులకే హక్కులు కలిగి ఉండాలని నైజాం ప్రభుత్వంతో వీరోచితంగా పోరాడి అసువులు బాసిన పోరుగడ్డ జోడేఘాట్‌కు రెండు వరుసలు రోడ్డు సౌకర్యం కల్పించాలనే ఉద్దేశంతో అప్పటి ప్రభుత్వం రూ.15 కోట్ల రూపాయలు మంజూరు చేసింది. హట్టి నుంచి ఘాట్ వరకు 1కిమి.టోకెన్ మోవాడ్ నుంచి జోడేఘాట్ వరకు 15 వరకు రోడ్డు పనులు పూర్తి చేయగా, హట్టి నుంచి టోకెన్ మోవాడ్ వరకు 5కిమి వరకు రోడ్డు పనులు నిలిచి పోయాయి. అటవీ అనుమతులు లేక నిలిచిపోయిన రోడ్డు పనులు తొమ్మిదేండ్లు పూర్తి కావస్తున్నా అనుమతులు రావడం లేదు. దీంతో రోడ్డు పనులు అసంపూర్తిగా మిగిలిపోయింది. గుంతలు పడిన రోడ్డుపై ప్రయాణం నరకప్రాయంగా మారింది. చరిత్రాత్మక గ్రామానికి వెళ్లేందుకు ఇబ్బందులు తప్పడంలేదని పోరు గ్రామాల ప్రజలు వాపోతున్నారు.

ఏటా మరమ్మతులేనా..

హట్టి గ్రామం నుంచి జోడేఘాట్ వరకు రోడ్డు అధ్వాన్నంగా తయారైంది. రోడ్డు పొడవునా గుంతలు ఏర్పడి ప్రయణమే కష్టంగా మారిందని ఆదివాసీ గిరిజనులు ఆరోపిస్తున్నారు. ప్రతి ఏటా వర్ధంతికి అధికారులు రోడ్డుకు నామమాత్రంగా మరమ్మతులు చేసి చేతులు దులుపుకోవడం పరిపాటిగామారింది. మరమ్మతుల పేరుతో రోడ్డుకిరువైపుల బ్లేడ్ ట్రాక్టర్లతో పిచ్చి మొక్కలు తొలగించడం, చదును చేయడం వంటి పనుల కారణంగా మట్టి వదులుగా మారి వర్షాలకు కొట్టుకుపోయింది. దీంతో రోడ్డు కిరువైపులా ఎత్తు పల్లాలుగా ఏర్పడి రోడ్డు కోతకు గురవుతుందని గిరి ప్రజలు ఆరోపిస్తున్నారు.

వర్షాలకు కొట్టుకుపోయిన కల్వర్టు

హట్టి గ్రామం నుంచి జోడేఘాట్ వరకు మార్గమధ్యలో చిన్న పాటి ఒర్రెలపై కల్వర్టులు నిర్మించారు. అధికారుల నిర్లక్ష్యం కారణంగా చేపట్టిన పనుల్లో నాణ్యత పాటించక పోవడంతోనే వర్షాలకు కల్వర్టులు కొట్టుపోతున్నాయని పోరు గ్రామాల ప్రజలు వాపోతున్నారు. చిన్న వర్షం పడితే చాలు కల్వర్టుపై నుంచి నీరు పారుతోంది.

రోడ్డు పనులు పూర్తి చేయాలి

పి.మోతీరాం, ఉత్సవ కమిటీ కన్వీనర్



ప్రతి సంవత్సరం రోడ్డుకు మరమ్మతులు చేయడంతో సమస్య పునారావృతం అవుతుంది. నిలిచి పోయిన 5కిమి రోడ్డు అస్తవ్యస్తంగా ఉంది. రోడ్డు పొడవునా గుంతలు ఏర్పడ్డాయి. వర్షాలకు కొట్టుకుపోయిన కల్వర్టులు ప్రమాదకరంగా ఉన్నాయి. అధికారులు, పాలకులు రోడ్డు సమస్య పరిష్కారానికి సత్వరమే చర్యలు చేపట్టాలి. ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలి.

అటవీ అనుమతులకు అలసత్వం సరికాదు

పెందూర్ రాజేశ్వర్, కుమురం భీం ఉత్సవ కమిటీ చైర్మన్



కొన్ని ఏండ్లుగా అటవీ అనుమతులు రోడ్డు పనులు పూర్తి కాలే. అనుమతులకు అలసత్వం సరికాది. రోడ్డు పనులు మధ్యంతరంగా నిలిచి పోవడంతో పోరు గ్రామాలకు ప్రజలు మండల కేంద్రానికి వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నారు. ఎవరు పట్టించుకోక పోవడంతో అటవీ అనుమతులు లేక 5కిమి రోడ్డు పనులు నిలిచిపోయాయి. కుమురం భీం వర్ధంతికి ప్రతి ఏటా మరమ్మతుల పేరుతో ప్రజాధనం వృధా అవుతుంది. భీం వర్ధంతికి ఉమ్మడి జిల్లా నుంచే కాకుండా పొరుగు రాష్ట్రాల నుంచి ఆదివాసుల అధిక సంఖ్యలో రానున్న నేపథ్యంలో రోడ్డుకు శాశ్వత పరిష్కారం చూపాలి.

ఆదివాసీ ప్రాంత సమస్యలు పరిష్కరించాలి

- మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు

నవతెలంగాణ-ఆసిఫాబాద్



జిల్లాలో ఆదివాసుల సమస్యలు పరిష్కరించాలని ఆసిఫాబాద్ మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు కోరారు. హైదరాబాద్‌లోని సీఎం నివాసంలో ఉమ్మడి జిల్లా ఎమ్మెల్సీ దండే విఠల్, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుతో కలిసి సీఎం రేవంత్ రెడ్డితో పాటు పీసీసీ అధ్యక్షుడు మహేష్ గౌడ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని షెడ్యూల్ ప్రాంతల పరిరక్షణ, చట్టాల అమలు చేయాలని, జైనూర్ ఘటన బాధితురాలి కుటుంబానికి రూ.25 లక్షల ఆర్థిక సాయం చేసి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని కోరారు. ఆదివాసులకు విద్య, వైద్యంతో పాటు స్వయం ఉపాధి కల్పన కోసం కృషి చేయాలన్నారు. ప్రతి ఆదివాసీ రైతుకు గిరి వికాస పథకం అమలు చేయాలని, గిరిజన యువత కోసం ప్రత్యేక డీఎస్సీ నిర్వహించాలన్నారు. ఏజెన్సీ ప్రాంత అవుట్ సోర్సింగ్ ఉద్యోగాలను గిరిజనులకు కేటాయించేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో ఆదివాసీ ప్రాంతాల్లో మౌలిక వసతులు కల్పించాలన్నారు. జిల్లాలో నిర్వహించే వివిధ ఆదివాసీ పోరాట యోధుల జయంతి, వర్ధంతి ఉత్సవాలకు అందించే నిధులు పెంచాలన్నారు. ఆసిఫాబాద్ నియోజకవర్గంలో గతంలో తన హయాంలో పనులు పూర్తయి పెండింగ్‌లో ఉన్న నిధులు మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారులు నరేందర్ రెడ్డి, కరీంనగర్ జిల్లా గ్రంధాలయ చైర్మన్ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కాంగ్రెస్ ఇన్‌చార్జి సత్తు మల్లేష్ పాల్గొన్నారు.

సంస్థ మనుగడ ఉద్యోగుల చేతుల్లో ఉంది



నవతెలంగాణ-రెబ్బెన

సింగరేణి సంస్థ మనుగడ ఉద్యోగుల చేతుల్లో ఉందని బెల్లంపల్లి ఏరియా జనరల్ మేనేజర్ ఎం శ్రీనివాస్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, సింగరేణి సంస్థ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ బలరాం ఆదేశాల మేరకు ఖైర్‌గూడ ఉపరితల గని వద్ద ఉజ్వల సింగరేణి ఉద్యోగుల పాత్ర కార్యక్రమంలో భాగంగా మల్టీ డిపార్ట్మెంటల్ కమిటీ అధికారులతో కలిసి ఉద్యోగులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. దీనికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ ప్రతి ఉద్యోగి సింగరేణి సంస్థ తనదే అనుకుని ఉత్పత్తి, ఉత్పాదకత పెంపుకోసం కృషి చేయాలన్నారు. బెల్లంపల్లి ఏరియాలో ఇప్పటి వరకు సాధించిన ఉత్పత్తి, ఉత్పాదకతను ఉద్యోగులకు వివరించారు. భవిష్యత్‌లో సాధించాల్సిన లక్ష్యాలను తెలిపారు. జీఆర్ఎస్ ప్రతినిధులు ఒప్పంద ఉద్యోగులకు ఒక్కొక్కరికి రూ.5000ల చొప్పున 880 మందికి అందించిన ఆధార పత్రాలను జీఎంకు ఇచ్చారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ బ్రాంచి కార్యదర్శి ఎస్.తిరుపతి, ఎస్ఓ టూ జీఎం కె.రాజమల్లు, ఖైర్‌గూర పీఓ ఎం.నరేందర్, ఏరియా ఇంజినీర్ భీంరావ్ జాడే, పర్సనల్ మేనేజర్ ఆర్.తిరుపతి, ప్రాజెక్ట్ ఇంజినీర్ వీరన్న, మేనేజర్ జె.శంకర్ పాల్గొన్నారు.

బౌద్ధ దీక్ష శమ్నీర్ శిబిర్ పోస్టర్ల విడుదల

నవతెలంగాణ-ఆసిఫాబాద్



ఈనెల 21 నుండి 30 వరకు కాగజ్‌నగర్ పట్టణంలోని మీరతాయి అంబేద్కర్ దీక్ష భూమిలో భారతీయ బౌద్ధ మహాసభ ఆధ్వర్యంలో నిర్వహించే జిల్లాస్థాయి బౌద్ధ దీక్ష శమ్నీర్ శిబిర్ పోస్టర్‌ను విడుదల చేశారు. గురువారం జిల్లా కేంద్రంలోని లుంబిని దీక్ష భూమిలో జిల్లా అధ్యక్షుడు అశోక్ మహల్కార్ చేతుల మీదుగా విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పది రోజుల పాటు నిర్వహించే శిబిరానికి ఉత్తర తెలంగాణ అధ్యక్షుడు గడపాలే ప్రభాకర్ పాల్గొంటారని, జిల్లాలోని బౌద్ధులు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు. బౌద్ధ మతం, రాజ్యాంగం, అంబేద్కర్ ఆశయాల గురించి పది రోజుల పాటు శిబిరంలో వివరిస్తారన్నారు. కార్యక్రమంలో భారతీయ బౌద్ధ మహా సభ జిల్లా కమిటీ ఉపాధ్యక్షులు తుకారాం చునార్కర్, ఆత్మరాం, కోశాధికారి తిరుపతి దుర్గం, జిల్లా నాయకులు ముంజాం మనోహర్, సంతోష్ జాడే, బౌద్ధ ఆచార్య జగతాప్, రాంటేకే అజయ్, రమేష్, దుర్గం శ్యామ్ రావు పాల్గొన్నారు.

రతన్‌టాటాకు నివాళులు



నవతెలంగాణ-కాగజ్‌నగర్

వ్యాపార దిగ్గజం రతన్‌టాటా మృతి పట్ల సీనియర్ సిటిజన్స్ అసోషియేషన్ సంతాపం ప్రకటించింది. గురవారం వారి కార్యాలయంలో రతన్ టాటా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అసోషియేషన్ రాష్ట్ర కార్యదర్శి మార్త సత్యనారాయణ మాట్లాడుతూ లక్షలాది మందికి ఉపాధి కల్పించిన పారిశ్రామికవేత్త రతన్‌టాటా మృతి చెందడం బాధాకరమన్నారు. కార్యక్రమంలో అసోషియేషన్ నాయకులు నారాయణ, బి నర్సయ్య, కోటేశ్వర్‌రావు, సీహెచ్ రామయ్య, ఎ.నాగేశ్వర్‌రావు, చిలుక లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

పీఆర్‌టీయూటీఎస్ ఆధ్వర్యంలో..

పీఆర్‌టీయూటీఎస్ ఆధ్వర్యంలో కూడా రతన్‌టాటాకు నివాళులర్పించారు. రతన్‌టాటా చిత్రపటానికి పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షులు ఎటుకూరి శ్రీనివాస్‌రావు, నాయకులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత



నవతెలంగాణ-పెంచికల్‌పేట్

మండలంలోని ఎలుకపెల్లి గ్రామానికి చెందిన బొట్ల తిరుపతికి సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా వచ్చిన రూ. 60 వేల చెక్కును ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు ఆదేశాల మేరకు బీజేపీ మండల అధ్యక్షుడు మధుకర్ అందజేశారు. కార్యక్రమంలో శక్తి కేంద్రం ఇన్‌చార్జి ఘనపురం నాగేష్, బూత్ అధ్యక్షుడు పెద్ది సంతోష్, మాజీ ఎంపీటీసీ దూగుంట రాజన్న, నాయకులు వెంకన్న, ప్రభాకర్, చందు పాల్గొన్నారు.

మంత్రులను కలిసిన జిల్లా నాయకులు



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలోని అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించి నిధుల విడుదల ఇతర అంశాల కోసం జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు విశ్వప్రసాద్, మాజీ ఎమ్మెల్సీ పురాణం సతీష్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ గాధవేణి మల్లేష్‌తో కలిసి రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి సీతక్కలను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జిల్లాలోని పలు అంశాలు, ప్రస్తుత రాజకీయ పరిస్థితులు వారి మధ్య చర్చకు వచ్చినట్లు తెలిసింది. పార్టీ బలోపేతం కోసం కృషి చేయాలని జిల్లా అభివృద్ధి కోసం అవసరమైన చర్యలు తీసుకుంటామని వారు హామీ ఇచ్చినట్లు వివరించారు.

రోడ్డుపై గుంతలు పూడ్చివేత



నవతెలంగాణ-పెంచికల్‌పేట్

మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప ఆదేశాల మేరకు బెజ్జూర్, పెంచికల్‌పేట్ రహదారిపై ఉన్న గుంతలను కోనప్ప అభిమానులు శ్రమదానం చేస్తూ గుంతలను మొరంతో పూడ్చారు. మరమ్మతులను మాజీ జడ్పీ చైర్మన్ కోనేరు కృష్ణారావు పరిశీలించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు తిరుపతి, సాజిత్, రాజన్న, బండు, చలం, అశోక్, భీమయ్య రాజేశ్వరి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

శ్యాంనాయక్ పుట్టినరోజు వేడుకలు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి శ్యాంనాయక్ పుట్టినరోజు వేడుకలు జిల్లా కేంద్రంలోని రోజ్ గార్డెన్‌లో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కేంద్రంలోని పలువురు ప్రముఖులు, నాయకులు ఆయనకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు.



నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
మంచిర్యాల
4
శుక్రవారం | అక్టోబర్ 11, 2024 | www.navatelangana.com

పత్తి కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలి

నవతెలంగాణ-జన్నారం



మండలంలో రైతులు పత్తిసాగు ఎక్కువగా సాగు చేసినందున మండల కేంద్రంలో ప్రభుత్వం పత్తి కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం మండల నాయకులు కొండగొర్ల లింగన్న, అంబటి లక్ష్మణ్ కోరారు. గురువారం సీపీఐ(ఎం) కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులు పండించే పత్తికి మద్దతు ధర ఇవ్వాలన్నారు. మండల కేంద్రంలో పత్తి కొనుగోలు కేంద్రం లేని కారణంగా రైతులు దళారులకు పత్తి అమ్మి మోసపోతున్నారన్నారు. ప్రభుత్వం, అధికారులు స్పందించి మండల కేంద్రంలో పత్తి కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

ఘనంగా కార్మిక నేత వెంగళరావు జయంతి

నవతెలంగాణ-కాసిపేట



మండల కేంద్రంలో కార్మిక నేత పూస్కూరి వెంగళరావు 69వ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముత్యంపల్లిలో వెంగళరావు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి ఆయన సేవలను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఆడె బాదు, మాజీ ఎంపీటీసీ కొండబత్తుల రాంచందర్, మాజీ ఉప సర్పంచ్ బోయిని తిరుపతి, బీఆర్ఎస్ కార్యదర్శి మోటూరి వేణు, వర్కింగ్ ప్రెసిడెంట్ రాంటింకి వాల్దేవ్, కాసిపేట గ్రామ అధ్యక్షుడు అగ్గి సత్తయ్య, బీఆర్ఎస్ నాయకులు జాడి రాంచందర్, లంక లక్ష్మణ్, బుగ్గ రాజు, బోయిని సాయికిరణ్, ఉస్కమల్ల గోపాల్, గంగాధారి రాజేశం, మల్లేశ్, పెంటయ్య పాల్గొన్నారు.

మాదకద్రావ్యాల నిర్మూలనకు చర్యలు

- గంజాయి అమ్ముతున్న ఐదుగురు నిందితుల అరెస్ట్



నవతెలంగాణ-తాండూర్

గంజాయి అక్రమ రవాణా, సాగు నిర్మూలనకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్టు సీఐ కుమారస్వామి తెలిపారు. గురువారం మాదారంలో గంజాయి అమ్ముతున్న ఐదుగురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. కాగా గురువారం పోలీసు స్టేషన్‌లో ఎస్సై సౌజన్యతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలను తెలియజేశారు. మాదారం శివారులో కుమురం భీం జిల్లా ఈస్‌గాం గ్రామానికి చెందిన కొంతమంది వ్యక్తులు నిషేధించబడ్డ గంజాయిని విక్రయిస్తున్నారనే సమాచారం అందింది. ఎస్సై సౌజన్య దాడులు నిర్వహించి పట్టుకున్నారని తెలిపారు. పట్టుకున్న తాండూరు గ్రామానికి చెందిన షేక్ హసమ్, బండారి శ్యామ్, తంగళ్ళపల్లి గ్రామానికి చెందిన గొర్లపల్లి సందీప్ కుమార్, విజయ్ హల్దార్, రాజ్‌కుమార్ సర్కార్ ఉన్నారని తెలిపారు. వీరి వద్ద నుండి రూ.27,500, విలువగల 1100 గ్రాముల గంజాయి పట్టుకున్నట్లు తెలిపారు. ఒక మోటారు సైకిల్, నలుగు సెల్ ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నట్టు పేర్కొన్నారు. తాండూరు సర్కిల్ పరిధిలో గంజాయి నిర్మూలనకు ప్రత్యేక నిఘా వ్యవస్థను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అమ్మకం దారుల ఇండ్లలో నార్కోటిక్ డాగ్‌తో తనిఖీలు చేయనున్నట్లు వివరించారు. గంజాయి పంట కోత దశలో ఉన్నందున పండగ సమయాల్లో స్మగ్లర్లు గంజాయి రవాణా చేయకుండా సర్కిల్ పరిధిలో పటిష్ఠమైన బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామన్నారు. పోలీస్ సిబ్బంది ద్వారా అనునిత్యం వాహన తనిఖీలను నిర్వహిస్తూ పెట్రోలింగ్ చేస్తామన్నారు. గంజాయి కేసులో పట్టుపడితే నిందితులకు కఠినమైన శిక్షలుంటాయని హెచ్చరించారు. బతుకమ్మ పండుగ రోజు గంజాయి స్మగ్లర్లను మాటు వేసి పట్టుకున్న ఎస్సై సౌజన్యను ఏసీపీ రవికుమార్ అభినందించారు.

ఘనంగా సద్దుల బతుకమ్మ వేడుకలు



నవతెలంగాణ-దండేపల్లి

మండలంలో బతుకమ్మ ఉత్సవ వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని ఆయా గ్రామాల్లో మహిళలు, యువతులు తీరొక్క పువ్వుతో బతుకమ్మలను పేర్చి ఒక్క చోట చేర్చి బతుకమ్మ పాటలు పడుతూ ఆనందంగా గడిపారు. మంచిర్యాల ఎమ్మెల్యే నడిపల్లి దివాకర్ రావు బతుకమ్మ వేడుకలకు హాజరై ఆసక్తిగా తిలకించారు. కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు సైతం బతుకమ్మ పండుగ సంబరాలలో పాలుపంచుకున్నారు. బతుకమ్మ ఆట పాటలతో మండలంలోని అన్నీ గ్రామాల్లో ఎక్కడ చూసిన బతుకమ్మ పండుగ వేడుకలతో సందడి నెలకొంది.

సద్దుల బతుకమ్మ నిమజ్జనానికి ఏర్పాట్లు పూర్తి



నవతెలంగాణ-జైపూర్

భీమారం మండల కేంద్రంలో సద్దుల బతుకమ్మ నిమజ్జనం ఏర్పాట్లు పూర్తి చేసినట్లు గ్రామ పంచాయతీ కార్యదర్శి క్రిష్ణమూర్తి తెలిపారు. భీమారం బస్టాండ్ ఏరియా బతుకమ్మలు ఊర చెరువు, గ్రామ పంచాయతీ, పద్మశాలి గూడెం, మర్రిచెట్టు ఏరియా బతుకమ్మల నిమజ్జనం కోసం కొత్తగూడెం శివారు కొత్త చెరువు వద్ద ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. మహిళలు ఇబ్బందులు ఎదుర్కొకుండా ముందస్తుగా రహదారి ఏర్పాట్లు చెరువులో బతుకమ్మలు నిమజ్జనం చేసే ప్రదేశం వరకు రోడ్డు చదును, అవసరమైన మేరకు విద్యుత్ దీపాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

దుర్గామాతను దర్శించుకున్న ఎమ్మెల్యే

నవతెలంగాణ-నేరడిగొండ

మండలంలోని కుమారి గ్రామంలో గురువారం దుర్గా మండపంలో దుర్గాదేవిని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ దర్శించుకొని, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామంలోని హనుమాన్ ఆలయంలో నైవేద్యం సమర్పించారు. గ్రామానికి విచ్చేసిన ఎమ్మెల్యేకి గ్రామస్తులు ఘనస్వాగతం పలికారు. మహిళలు మండప సభ్యులు ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. ఎమ్మెల్యే వెంట మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తేజపూర్‌లో కాంగ్రెస్ బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జీ ఆడే గజేందర్..

మండలంలోని తేజపూర్ గ్రామంలో గురువారం దుర్గాదేవిని కాంగ్రెస్ బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జీ ఆదే గజేందర్ దర్శించుకున్నారు. అనంతరం ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయనను దుర్గాదేవి మండప కమిటీ సభ్యులు శాలువాతో ఘనంగా సన్మానించారు. ఇటీవల తేజపూర్ గ్రామనికి చెందిన డి.ఉదయ్ కిరణ్ ఎస్‌జీటీ ఉద్యోగం సాధించినందుకు ఆయనకు శుభాకాంక్షలు తెలిపి శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో బోథ్ బ్లాక్ కాంగ్రెస్ ప్రెసిడెంట్ అల్లూరి ప్రఫుల్ రెడ్డి, బోథ్ అసెంబ్లీ యువజన కాంగ్రెస్ అధ్యక్షులు బద్దం పోతారెడ్డి, నాయకులు ఉమేష్, విలాస్, స్వామి, పోతారెడ్డి పాల్గొన్నారు.



ప్రజల అవసరాల మేరకు అంతర్గత రోడ్లు



నవతెలంగాణ-జైపూర్

చెన్నూర్ మున్సిపాలిటీ పరిధిలో ప్రజల అవసరాల మేరకు అంతర్గత రోడ్లు, మురుగు కాలువల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్టు కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. చెన్నూర్ మున్సిపాలిటీ 4 వార్డులో డీఎంఎఫ్‌టీ నిధులు రూ. 62.90 లక్షల అంచనా వ్యయంతో అంతర్గత సీసీ రోడ్లు, మురుగు కాలువల నిర్మాణానికి గురువారం ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామితో కలిసి ఆయన శంకు స్థాపన చేశారు. నియోజకవర్గం పరిధిలో చెన్నూర్ మున్సిపాలిటితో పాటు క్యాతన్‌పల్లి, మందమర్రిలో 26 పనులు రూ. 4.5 కోట్ల అంచనా వ్యయంతో పనులు కొనసాగుతున్నట్లు తెలిపారు. నిర్మాణ పనులు వేగవంతంగా పూర్తి అయ్యే విధంగా అధికారులు, గుత్తెదారులు సమన్వయంతో పని చేయాలన్నారు. చెన్నూర్‌లో అమృత్ 2.0 పథకం ద్వార ప్రజలందరికి తాగు నీరు అందించేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతందన్నారు. రాబోవు రెండు మూడు నెలల్లో కార్యాచరణ ప్రకారం అభివృద్ధి పనులు పూర్తి చేసే విధంగా అధికారులు క్షేత్రస్థాయిలో కృషి చేయాలన్నారు.

మార్నింగ్ వాక్ ద్వార ప్రజల సమస్యలు గుర్తించాం :ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి

నియోజకవర్గం పరిధి మున్సిపాలిటీల్లో మార్నింగ్ వాక్ ద్వార ప్రజల సమస్యలు గుర్తించామని ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి అన్నారు. కనీస అవసరాలు, ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని ప్రజలు కోరారన్నారు. మున్సిపాలిటీలో అన్ని వార్డుల్లో డ్రైనేజీలు సరిగ్గా లేక రోడ్‌లు బాగా లేకపోవడం ప్రజలు నా దృష్టికి తీసుకొచ్చారు. మందమర్రి క్యాతన్‌పల్లి చెన్నూర్ పట్టణంలో రూ.4 కోట్లతో పనులు పూర్తి చేయనున్నట్లు తెలిపారు. నియోజకవర్గం పరిధి అభివృద్ధికి ప్రజలు సహకరించాలని కోరారు. మిషన్ భగీరథ ప్రాజెక్టులో అనేక అవకతవకలు జరిగాయని ఆరోపించారు. కాళేశ్వరం బ్యాక్ వాటర్‌తో చెన్నూర్ రైతులు నష్టపోయారన్నారు. మంత్రితో మాట్లాడి ఇక్కడి రైతుల సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. బీఆర్ఎస్ నాయకులు సోషల్ మీడియాలో అసత్య ప్రచారం చేస్తూ కాంగ్రెస్ ఏమీ చేయడం లేదనడం బాధాకరమన్నారు. రూ. 100 కోట్లతో జోడువాగు రోడ్డు నిర్మాణం కోసం నిధులు మంజూరు, రూ.125 కోట్లతో ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణానికి శంకు స్థాపన చేయబోతున్నామన్నారు. అంబేద్కర్ భవన్‌కు రూ. 20 లక్షలు మంజూరు చేశామని, చెన్నూర్‌లో నేతకాని భవనాన్ని త్వరలో నిర్మిస్తామన్నారు. కోటపల్లిలో అంబులెన్స్ అవసరం ఉన్నట్లు గుర్తించి కలెక్టర్‌తో మాట్లాడి 2 అంబులెన్స్‌లు ఏర్పాటు చేస్తున్నామని, 100 పడకల ఆస్పత్రిని తొందరగా మంజూరు చేయాలని సంబంధిత శాఖ మంత్రిని కోరినట్లు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కమీషనర్ గంగాధర్, తహసీల్దార్ మల్లిఖార్జున్, మున్సిపల్ చైర్‌పర్సన్ అర్చనా గిల్డా పాల్గొన్నారు.

మంచి భవిష్యత్తు అందించే దిశగా కృషి చేయాలి

- కలెక్టర్ కుమార్ దీపక్



నవతెలంగాణ-నస్పూర్

విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి, మంచి భవిష్యత్తు అందించే దిశగా కృషి చేయాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం కలెక్టర్ కార్యాలయంలో జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో నూతనంగా నియమితులైన ఉపాధ్యాయులతో నిర్వహించిన ముఖాముఖి కార్యక్రమానికి డీఈఓతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయులకే ఉంటుందని, పిల్లలు ఎక్కువ సమయంలో పాఠశాలలో వారితోనే గడుపుతారన్నారు. ప్రభుత్వం విద్యారంగ అభివృద్ధికి కట్టుబడి ఉందని, ప్రభుత్వ పాఠశాలలు బలోపేతం చేయడం ద్వారా సమాజాభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. అతి తక్కువ సమయంలో డీఎస్సీ పరీక్ష నిర్వహించడం, ఫలితాలు ప్రకటించడం, ఉద్యోగ నియామక పత్రాలు ఇవ్వడం జరిగిందని, త్వరలోనే పాఠశాలల కేటాయింపు ప్రక్రియ పూర్తి చేస్తామన్నారు. ప్రతి ఉపాధ్యాయుడు అభ్యాసన సామర్థ్యాలలో వెనుకబడిన 5 మంది విద్యార్థులను దత్తత తీసుకొని, మిగతా విద్యార్థులతో సమానంగా తీర్చిదిద్దేలా ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. నిబద్ధతతో పని చేస్తూ విద్యార్థుల భవిష్యత్తును సన్మార్గంలో ఉన్నతంగా తీర్చిదిద్దాలని, మంచిర్యాల జిల్లాను రాష్ట్రంలోనే ముందు వరుసలో నిలిపేందుకు సమిష్టిగా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో సమగ్ర శిక్ష సమన్వయకర్తలు చౌదరి, సత్యనారాయణమూర్తి, మండల విద్యాధికారులు, ప్రధానోపాధ్యాయులు, నూతనంగా ఎంపికైన ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

స్పష్టమైన ఓటరు జాబితా రూపొందించాలి

జిల్లాలో ఎలాంటి అవకతవకలు లేకుండా స్పష్టమైన ఓటరు జాబితా రూపొందించే దిశగా అధికారులు, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు సమన్వయంతో కృషి చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం జిల్లాలోని కలెక్టర్ చాంబర్ లో అధికారులు, రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఓటరు జాబితా రూపకల్పనపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఓటరు జాబితాను ఎలాంటి పొరపాట్లు లేకుండా స్పష్టంగా తయారు చేయాలని, ప్రీ-రివిజన్, రివిజన్ యాక్టివిటీస్ ద్వారా చర్యలు తీసుకుంటున్నట్టు పేర్కొన్నారు. ప్రీ-రివిజన్ యాక్టివిటీస్లో భాగంగా ఆగస్టు 20 నుండి ఈ నెల 18 వరకు ఇంటింటి సర్వే, పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ, జాబితాలో తేడాలున్న వివరాలు నిబంధనల మేరకు తొలగింపు, జాబితాలో సెక్షన్లు, పార్టు, పోలింగ్ కేంద్రాల హద్దులు ఏర్పాటు చేసి అనుమతికి సమర్పించడం, సమస్యలను గుర్తించి పరిష్కారానికి చర్యలు, కంట్రోల్ టేబుల్ అప్‌డేషన్ ప్రక్రియ కొనసాగుతుందన్నారు. ఈ నెల 19 నుండి 28 వరకు 1 నుండి 8 వరకు దరఖాస్తు ఫారాలను పరిశీలించి ముసాయిదా జాబితా రూపొందించాలన్నారు. పట్టభద్రులు, ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి కార్యచరణలో భాగంగా నవంబర్ 6న నమోదు చేసుకునేందుకు చివరి తేదన్నారు. నవంబర్ 20న నమోదైన దరఖాస్తులను పరిశీలించి ముసాయిదా జాబితా సిద్ధం చేసి 23న ప్రచురిస్తామన్నారు. అర్హత గల వారు పట్టభద్రుల ఎమ్మెల్సీకి ఫారం-18, ఉపాధ్యాయ ఎమ్మెల్సీకి ఫారం-19 ద్వారా వివరాలు నమోదు చేసుకోవాలన్నారు. అర్హత గల వారందరు ఓటరు జాబితాలో తమ వివరాలు నమోదు చేసుకునే విధంగా రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఎన్నికల అధికారులకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో మంచిర్యాల, బెల్లంపల్లి ఆర్డీఓలు వి. రాములు, హరికృష్ణ, భూ సేకరణ ప్రత్యేక అధికారి డి.చంద్రకళ, రాజకీయ పార్టీల ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

సంస్థను కాపాడుకుంటేనే భవిష్యత్తు

- ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు



నవతెలంగాణ-నస్పూర్

సింగరేణి సంస్థను కాపాడుకుంటేనే భవిష్యత్తు ఉంటుందని మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు అన్నారు. గురువారం జీఎం సంజీవరెడ్డి అధ్యక్షతన నిర్వహించిన ఉజ్వల సింగరేణి ఉద్యోగుల పాత్ర సదస్సులో గుర్తింపు కార్మిక సంఘం అధ్యక్షుడు సీతారామయ్యతో కలిసి పాల్గొని మాట్లాడారు. సింగరేణి గనులు ప్రయివేట్ కాకుండా అడ్డుకుంటానని, కార్మికులకు సంస్థ స్థితిగతులు, అభివృద్ధి, ఉత్పత్తి, రవాణా, ఉత్పాదకతపై అవగాహన కల్పించారు. సింగరేణి అభివృద్ధితోనే తెలంగాణా అభివృద్ధి ఆధారపడి ఉందన్నారు. ట్రాన్స్‌కో, జెన్కోల నుంచి ప్రభుత్వం ద్వారా బకాయిలు తెప్పించడానికి కృషి చేస్తానని పేర్కొన్నారు. శ్రీరాంపూర్ ఏరియాకు మరో 40 సంవత్సరాల భవిష్యత్తుందన్నారు. సింగరేణి 11 అవార్డుల్లో 6 అవార్డులు శ్రీరాంపూర్‌కు రావడం సంతోషకరమన్నారు. భూగర్భ గనుల్లో ఉత్పత్తి పెంచి నష్టాలను తగ్గించు కోవాల్సిన అవసరముందన్నారు. సింగరేణిలో 20 శాతం బొగ్గు ఉత్పత్తి శ్రీరాంపూర్‌లో జరుగుతుందన్నారు. కార్మికులకు అన్ని విదాలా అండగా ఉంటానని చెప్పారు. జైపూర్‌లో విద్యుత్ పవర్ ప్లాంట్ 6 అవార్డులు శ్రీరాంపూర్‌కు రావడం సంతోషకరమన్నారు. సంస్థ అభివృద్ధికి నిధులు కేటాయిస్తే కొన్ని సంఘాలు తప్పుడు ప్రచారం చేయడం మానుకోవాలని హితవు పలికారు. కోలిండియా రూ.37 వేల కోట్ల లాబాల్లో ఉన్నా కార్మికులకు ఒక్క రూపాయి కూడా ఇవ్వడం లేదన్నారు. కార్మికులకుక 33 శాతం వాటా, కాంట్రాక్టు కార్మికులకు లాబాల్లో రూ.5 వేల ఇప్పించడం జరిగిందన్నారు. ఈ సమావేశంలో ఓసీపీ పీఓ శ్రీనివాస్, ఏజెంట్లు గోపాల్ సింగ్, ఏవీరెడ్డి, మేనేజర్ బ్రహ్మాజీ, ఏఐటీయూసీ బ్రాంచి కార్యదర్శి ఎస్‌కే బాజీసైదా, డిప్యూటీ ప్రధాన కార్యదర్శి వీరబద్రయ్య, సమ్మయ్య, ఐఎన్టీయూసీ ఉపాధ్యక్షుడు జెట్టి శంకర్‌రావు, వెల్ఫేర్ ఆఫీసర్ శంకర్ పాల్గొన్నారు.

చైన్ స్నాచింగ్ కేసులో దొంగ అరెస్టు

నవతెలంగాణ-జన్నారం



చైన్ స్నాచింగ్ కేసులో దొంగను అరెస్టు చేసినట్టు ఎస్సై రాజావర్ధన్ తెలిపారు. గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలను తెలియజేశారు. ఈనెల మూడవ తేదీన మండలంలోని దేవునిగూడా గ్రామంలో ఉట్నూరు మండలం దంతన్‌పల్లి గ్రామానికి చెందిన చింతకింది లావణ్య, భర్త శేఖర్ కలిసి ఫంక్షన్‌కు వెళ్లగా వస్తుండగా ఆమె మెడలో నుంచి రెండు తులాల పుస్తెలతాడును గుర్తుతెలియని వ్యక్తి మోటార్ సైకిల్‌పై లాక్కెళ్లారు. భర్త శేఖర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పై అధికారుల సూచన మేరకు సాంకేతిక పరిజ్ఞానంతో రేండ్లగూడ గ్రామానికి చెందిన బోర్లకుంట రాజేందర్‌గా గుర్తించారు. అతన్ని అరెస్టు చేసి దొంగిలించిన రెండు తులాల పుస్తెలతాడు, స్నాచింగ్ చేయడానికి ఉపయోగించిన పల్సర్ మోటార్ సైకిల్‌ను రికవరీ చేసి రిమాండ్‌కు తరలించినట్టు పేర్కొన్నారు. కేసును చేదించిన ఎస్సై రాజ వర్ధన్, రెండవ ఎస్ఐ తానాజీ నాయక్, సిబ్బంది తుకారం, హెడ్ కానిస్టేబుల్, సురేష్ కానిస్టేబుల్‌లను ఉన్నతాధికారులు ప్రశంసించారు.

బతుకమ్మ పాట సీడీ ఆవిష్కరణ



నవతెలంగాణ-జన్నారం

మండలంలోని రాఘవేంద్ర సినీ క్రియేషన్స్ ఆధ్వర్యంలో నిర్మించిన రామానా ఉయాలో బతుకమ్మ పాటల సిడిని మండల మాజీ జడ్పీటీసీ ఎర్ర చంద్రశేఖర్ గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ సాంప్రదాయ పండగలను పరిరక్షించాలనే ఉద్దేశంతో ఈ పాటను చిత్రీకరించడం జరిగిందన్నారు. దీనిని ప్రజలంతా ఆదరించాలని కోరారు. సంస్కృతి సాంప్రదాయాలను కాపాడాలన్నారు. నాయకులు తాళ్లపెల్లి రాజేశ్వర్, రజాక్, రాజ్ వెంకట్ పాల్గొన్నారు.

బతుకమ్మ సంబరాలకు ఏర్పాట్లు పూర్తి

- మున్సిపల్ చైర్మన్ నల్మాస్ కాంతయ్య



నవతెలంగాణ-లక్షెట్టిపేట

తెలంగాణ సంస్కృతిని చాటే సద్దుల బతుకమ్మ, జంబి గద్దెకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని మున్సిపల్ చైర్మన్ నల్మాస్ కాంతయ్య అన్నారు. గురువారం మున్సిపాలిటీ పరిధిలోని ఇటిక్యాల చెరువు ఘాట్ వద్ద సద్దుల బతుకమ్మ, జంబి గద్దె ఏర్పాట్లను పరిశీలించి మాట్లాడారు. మహిళలకు సద్దుల బతుకమ్మకు ఏలాంటి ఆటంకాలు జరగకుండా సజావుగా నిర్వహించుకోవాలన్నారు. దానికనుగుణంగా ఏర్పాట్లు చేస్తున్నట్టు పేర్కొన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ పోడేటి శ్రీనివాస్ గౌడ్, కౌన్సిలర్ సురేష్ నాయక్, తహసీల్దార్ దిలీప్‌కుమార్, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

మండల ప్రజలపై దుర్గాదేవి ఆశీస్సులుండాలి



నవతెలంగాణ-జన్నారం

మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన దుర్గాదేవి మండపాన్ని తెలంగాణ నేతకాని మహర్ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సాయిని ప్రసాద్ నేత గురువారం సందర్శించి అమ్మవారికి పూజలు నిర్వహించారు. మండల ప్రజలపై అమ్మవారి ఆశీస్సులు, అనుగ్రహం ఉండాలని కోరుకున్నారు. కార్యక్రమంలో నాయకులు వొళ్ళల నర్సగౌడ్, మంతెన వెంకటేష్, తెలంగాణ నేతకాని మహర్ విద్యార్థి సంఘం నాయకులు దుర్గం వినోద్, అల్లూరి వినోద్ కుమార్, దాసరి శ్రీనివాస్, దేవినవరాత్రి ఉత్సవ కమిటీ సభ్యులు అరవింద్, అభినయ్ గౌడ్ సంతోష్ పాల్గొన్నారు.

దుర్గామాతను దర్శించుకున్న సాయిమౌనారెడ్డి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పట్టణంలోని దుర్గానగర్ దుర్గాదేవి శరన్నవరాత్రోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇన్‌చార్జి కంది శ్రీనివాసరెడ్డి సతీమణి కంది సాయిమౌనా శ్రీనివాస్‌రెడ్డి దుర్గామాత ఆలయాన్ని సందర్శించారు. కుటంబ సభ్యులతో కలిసి దుర్గామాతను దర్శించి, ప్రత్యేక పూజలు నిర్వహంచారు. అమ్మవారికి ఓడి బియ్యాన్ని సమర్పించారు.

దుర్గాదేవి మండపం వద్ద అన్నదానం

నవతెలంగాణ-నార్నూర్

మండలంలోని తాడిహత్నూర్‌లో గురువారం దుర్గాదేవి మండపంలో దేవి శరన్నవరాత్రి ఉత్సవాలో భాగంగా గ్రామ శివ గణేష్ యూత్ సభ్యులు జాదవ్ జితేందర్, జాదవ్ ఉపేందర్‌లు దాతగా ముందుకు వచ్చి అన్నదానం చేశారు. ఈ సందర్భంగా అన్నదానం వితరణ చేసిన అన్నదమ్ములకు కుటుంబ సభ్యులను గురువారం మండప సభ్యులు అభినందించారు.



నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్
శుక్రవారం | అక్టోబర్ 11, 2024 | www.navatelangana.com

వికీపీడియా టెక్నాలజీ సమ్మిట్‌కు హాజరైన వికీపీడియాన్స్

నవతెలంగాణ-ఉట్నూర్



భారతీయ బహు భాషల వికీపీడియాల అభివృద్ధి, స్వేచ్ఛ విజ్ఞాన సర్వస్వాన్ని విస్తరించడానికి హైదరాబాద్ రాజధాని గచ్చిబౌలిలో నిర్వహించిన వికీమీడియా టెక్నాలజీ సమ్మిట్ 4, 5తేదీల్లో జరిగింది. ఆ సదస్సుకు జిల్లాకు చెందిన వికీపీడియాన్స్ రాథోడ్ శ్రావణ్, ఆత్రం మోతీరామ్, ఆత్రం రాజ్ కుమార్, సిడాం వర ప్రసాద్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వికీ ఇండిక్స్ మేనేజర్ కృపాల్ కశ్యప్, బోలి చేతో ఫౌండేషన్ సీఈఓ నేతి సాయి కిరణ్, డైరెక్టర్ జ్యోతిదేవి, యర్రా రామారావు గిరిజన వికీపీడియన్స్‌ని సదస్సులో అభినందించారు.

భక్తి శ్రద్ధలతో శారదదేవికి కుంకుమార్చన

నవతెలంగాణ-తలమడుగు



మండలంలోని కజ్జర్ల గ్రామంలో శారదదేవి మండపం వద్ద భక్తులు భక్తి శ్రద్ధలతో కుంకుమార్చన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ముందుగా వేదమంత్రోచ్ఛరణ మధ్య శారదదేవికి 51 రకాల నైవేధ్యాలను సమర్పించారు. ఈ సందర్భంగా వారు గత మూడేండ్లుగా శరన్నవరాత్రులు వైభవంగా నిర్వహిస్తున్నామని భక్తులు పేర్కొన్నారు. శారదదేవిని ఆదివారం సాయంత్రం నిమజ్జన కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో మహిళలు పాల్గొన్నారు.

కౌటాల తహసీల్దార్‌పై కలెక్టర్‌కు ఫిర్యాదు



నవతెలంగాణ-ఆసిఫాబాద్

కౌటాల మండలంలో రెవెన్యూ పనులు తహసీల్దార్ అలసత్వంతో ఆలస్యం అవుతున్నాయని మండలానికి చెందిన టప్ప గోపాల్, తాళ్లపల్లి రవీందర్ గౌడ్‌తో పాటు పలువురు ఆరోపించారు. గురువారం కలెక్టర్ వెంకటేష్ ధోత్రేను కలిసి తహసీల్దార్‌పై ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులకు అవసరమైన సర్టిఫికెట్లు సరైన సమయంలో మంజూరు చేయకుండా ఆలస్యం చేస్తున్నారన్నారు. అలాగే రెవెన్యూ పరిధిలోని పనులను కూడా పెండింగ్‌లో ఉంచడం వల్ల మండల వాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తహసీల్దార్ కార్యాలయంలో పనులు పెండింగ్ లేకుండా చూడాలని కోరారు. కార్యక్రమంలో మండలవాసులు పాల్గొన్నారు.

మానసిక ఆరోగ్యం మహాభాగ్యం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

మానసిక ఆరోగ్యం మహాభాగ్యమని జిల్లా మానసిక ఆరోగ్య కార్యక్రమం అధికారి డాక్టర్ శ్రీధర్ మెటిపెల్లివార్ అన్నారు. ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానసిక ఆరోగ్యాన్ని మించిన సంపద మరొకటి లేదన్నారు. చిన్న చిన్న సమస్యలకు భయపడకుండా ధైర్యంగా ఎదుర్కోవాలని సూచించారు. ప్రతి సమస్యకు పరిష్కారం ఉంటుందని తెలిపారు. అనవసర ఆందోళనలతో ఆత్మహత్యల వంటి తొందరపాటు నిర్ణయాలు తీసుకోవద్దని కోరారు. మానసిక ఒత్తిడితో బాధపడేవారు టోల్ ఫ్రీ నెంబర్ 14416కు ఫోన్ చేసి ఉచిత కౌన్సిలింగ్ సహాయం పొందవచ్చని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ సాధన, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ వైసీ శ్రీనివాస్, కార్యాలయ పర్యవేక్షకులు గోపి, స్టాటిస్టికల్ అధికారి బ్రహ్మానందరెడ్డి, డెమో వెంకటరెడ్డి, సైకాలజిస్ట్ శ్రీకాంత్, ప్రోగ్రాం కోఆర్డినేటర్ శ్రీనివాస్, రమణ, కార్యాలయ సిబ్బంది ఉన్నారు.

లంబాడీలకు మౌలిక సౌకర్యాలు కల్పించాలి



నవతెలంగాణ-ఉట్నూర్

తండాలో నివసిస్తున్న లంబాడి ప్రజలకు మౌలిక సౌకర్యాలు కల్పించాలని లంబాడ జేఏసీ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి బాణోత్ జగన్ అన్నారు. గురువారం సబ్ కలెక్టర్ యువరాజ్ మర్మాట్‌ను ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. శాలువాలతో సన్మానించారు. అనంతరం జగన్ మాట్లాడుతూ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ప్రతి తండాలో నివసిస్తున్న లంబాడి ప్రజలకు మౌలిక సౌకర్యాలు కల్పించి, సాగు చేస్తున్న భూమికి అటవీ హక్కు పత్రం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు రెడ్డి నాయక్, జేఏసీ ఉపాధ్యక్షులు ఆడే సురేష్, జాదవ్ గోపాల్‌రావ్, నేతావత్ రాందాస్, గంగారాం, భారత్ చవాన్, సుధాకర్ నాయక్, ప్రవీణ్ నాయక్, టీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాథోడ్ గణేష్ పాల్గొన్నారు.

గ్రామ మంచినీటి సహాయకులకు ధ్రువీకరణ పత్రాలు అందజేత



నవతెలంగాణ-ఖానాపూర్

పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయంలో మిషన్ భగీరథ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శిక్షణలో పాల్గొన్న గ్రామ మంచినీటి సహాయకులకు అడిషనల్ కలెక్టర్ ఫైజల్ హైమద్ ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొన్ని రోజుల నుండి గ్రామ మంచినీటి సహాయకులుగా శిక్షణ తీసుకున్నారన్నారు. ప్రతి గ్రామం నుండి శిక్షణలో పాల్గొన్నారని, శిక్షణ అంశాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రాజురా సత్యం, ఎంపీడీవో లక్ష్మి, ఎంపీఓ రత్నాకర్‌రావు, మిషన్ భగీరథ అధికారులు, కాంగ్రెస్ మండల అధ్యక్షులు దొనికేని దయానంద్, పెంబి కాంగ్రెస్ మండల అధ్యక్షులు స్వప్నిల్‌రెడ్డి పాల్గొన్నారు.

పెండింగ్ దరఖాస్తులు పరిష్కరించాలి



- అధికారులతో కలెక్టర్ సమీక్షా సమావేశం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

భూముల క్రమబద్ధీకరణ (ఎల్ఆర్ఎస్) దరఖాస్తులను సత్వరమే పరిష్కరించేందుకు ఎల్ఆర్ఎస్ లేఅవుట్ క్రమబద్ధీకరణ పథకం కింద పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను జీపీల వారిగా ఇంటింటికి వెళ్లి పరిశీలించడం జరుగుతున్నదని, ఈ ప్రక్రియ అక్టోబర్ మాసం చివరి నాటికి పూర్తి చేయాలని కలెక్టర్ రాజర్షిషా అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో ఫ్యామిలీ డిజిటల్ కార్డుల పైలెట్ ప్రాజెక్టు, ధరణీపై సబ్ కలెక్టర్ యువరాజ్ మర్మట్‌తో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 3వ తేదీ నుంచి 8వ తేదీ వరకు నిర్వహించిన ఫ్యామిలీ డిజిటల్ కార్డు పైలట్ ప్రాజెక్టు కింద ఆదిలాబాద్‌రూరల్ లోహార, గుడిహత్నూర్ మండలంలోని గోండు హర్కాపూర్, ఇచ్చోడ మండలంలోని అడేగాం(బి), మునిసిపాలిటీలోని రామ్‌నగర్ 11వ వార్డులలో టీమ్‌ల వారిగా ఇంటింటికి తిరిగి నిర్వహించిన సర్వే 8 వ తేదీ నాటికి పూర్తి చేయడం జరిగిందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ప్రతి కుటుంబానికి ఒక డిజిటల్ కార్డు ఇవ్వాలని, ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో ఒక అర్బన్ వార్డు, గ్రామపంచాయతీని పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేయడం జరిగిందన్నారు.

ఆన్‌లైన్‌లో సక్రమంగా నమోదు చేయాలి

ఈ సందర్భంగా టీముల వారిగా నిర్వహించిన సర్వే ఆన్‌లైన్‌లో డేటా ఎంట్రీ డిటైల్స్, ఫ్యామిలీ ఫొటో అప్ లోడ్‌పై ఆరా తీశారు. సర్వే చేసిన కుటుంబంలో ఫ్యామిలీ ఫొటో తీసుకోని వారు మళ్లీ ఇంటింటికి వెళ్లి రేపటిలోగా ఫొటో తీసుకొని ఆన్‌లైన్‌లో ఫొటో ఎంట్రీ చేయాలని ఆదేశించారు. అర్బన్‌లో నిర్వహించిన సర్వేలో కుటుంబ సభ్యులకు సంబంధించిన వివరాలు ఫార్మట్ ప్రకారంగా సేకరించడం జరిగిందన్నారు. ప్రతి ఇంటింటి సర్వేలో కొన్ని చోట్ల కుటుంబ ఫొటో తీయకపోవడంతో అసహనం వ్యక్తం చేశారు. మిస్సయిన కుటుంబాల్లో ఇంటింటికి వెళ్లి ఫొటో కార్యక్రమాన్ని రేపటిలోగా పూర్తి చేసి ఆన్‌లైన్‌లో ఎంట్రీ చేయాలని ఆదేశించారు. ఫొటో సరిగా తీసుకొని ఆ ఫోటోకు సంబందించిన వివరాలు నమోదు చేయాలని, రేపటిలోగా అప్‌లోడ్ కావాలని, నిర్లక్ష్యం వహిస్తే తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.

ధరణి పెండింగ్ దరఖాస్తులపై సమీక్ష...

పంచాయతీ సెక్రటరీ, రెవిన్యూ, ఇరిగేషన్ టీమ్‌గా వెళ్లి పరిశీలించి పెండింగ్ ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు క్లియర్ చేయాలని అన్నారు. మండలాల వారిగా జీపీలో దరఖాస్తులు మొత్తం జిల్లాలో 8,994 దరఖాస్తుల్లో 1,001 పరిశీలించి, 757 అప్రూవ్ చేయడం జరిగిందని తెలిపారు. మిగతావి ప్రతిరోజూ 20చొప్పున పరిశీలించి గడువులోగా లక్ష్యాలను సాధిస్తామని డీఎల్పీఓ తెలిపారు. టెక్నికల్ సమస్యలు ఏమైనా ఉంటే వెంటనే తెలపాలని, ప్రతీ రోజూ సిబ్బంది ఫీల్డ్‌కి వెళుతున్నది లేనిది తహసీల్దార్లు క్షేత్ర స్థాయిలో పర్యవేక్షించాలని అన్నారు. ధరణిలో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులపై సమీక్షించి, సంబంధిత తహసీల్దార్లు, ఆర్డీఓ, తదితర పెండింగ్ ఉన్న దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఆర్డీఓ వినోద్ కుమార్, డీపీఓ శ్రీలత, తహసీల్దార్లు, పంచాయతీ, ఇరిగేషన్, ఎంపీడీఓ, ఎంపీఓ పాల్గొన్నారు.

మాలీ సంఘం జెండా వారోత్సవాలు ప్రారంభం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



మాలిల ఉద్యమ పతకమైన మాలి సంఘం జెండా పండుగ వారోత్సవాలను గురువారం జిల్లా కేంద్రంలోని టీచర్స్ కాలనీలో గల పూలే గెస్ట్ హౌస్ లో అఖిల భారతీయ మాలి మహా సంఘం ఆధ్వర్యంలో ప్రారంభించారు. ముందుగా జ్యోతిబాపూలే, సావిత్రిబాయి పూలే దంపతుల చిత్రపటాలకు పూలమాలలు వేసి, కొవ్వొత్తులు వెలిగించి జెండాను ఎగరేసిప్రారంభించారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు సుకుమార్ పేట్కులే మాట్లాడుతూ.. గత 24 సంవత్సరాలుగా మాలీల కోసం మాలీల ఉద్యమ జెండా సాక్షిగా అనేక పోరాటాలు చేసామని, ఆ పోరాట ఫలితంగానే గత ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం చేసి మాలీలకు ఎస్టీ హెూదా బిల్లు కేంద్రానికి పంపించడం జరిగిందని అన్నారు. కేంద్రం వెంటనే స్పందించి ఎస్టి హెూదా బిల్లుకు ఆమోదముద్ర వేయాలని అన్నారు. అలాగే ప్రస్తుతం ఉన్న రాష్ట్ర ప్రభుత్వం బిల్లు ఆమోదం పొందేలా కృషిచేసి మాలీ కులస్తులకు సామాజిక న్యాయం కల్పించాలని అన్నారు. ఆర్థిక, సామాజిక, రాజకీయ, విద్యా, ఉద్యోగ రంగాల్లో మాలీలు వెనుకబడి ఉన్నారని, ఎస్టీ హోదా కల్పన వల్లనే మాలీకులస్తులకు న్యాయం జరుగుతుందని అన్నారు. మాలీ కులస్తులు నివసిస్తున్న అన్ని గ్రామాల్లో జెండాలను ఎగిరేసి మాలీలో ఐక్యతను చాటుకుని హక్కుల సాధనకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాలీ మహా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాంబన్న, జిల్లా అధ్యక్షులు విజయ వాడగూరే మాలీ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు చంద్రశేఖర్ అంబేకర్, కార్యవర్గ సభ్యులు అనిల్ కోట్రంగే, అనిల్ మొహూర్లే, పట్టణ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శ్రీను ఆచారి, సుభాష్ శెండే పాల్గొన్నారు.

వికలాంగుల కాలనీ ఏర్పాటు చేయాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

వికలాంగుల కాలనీ ఏర్పాటు చేయాలని హ్యాండిక్యాప్ హెల్పింగ్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు మహ్మద్ ఇమ్రాన్ అన్నారు. గురువారం సొసైటీ ఆధ్వర్యంలో వికలాంగుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎటువంటి షరతులు లేకుండా ప్రతి వికలాంగులకు పెన్షన్ వచ్చేటట్టు ఉద్యేశంతోనే సీఎం రేవంత్ రెడ్డిని కలువడానికి ఛలో హైదరాబాద్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. సమావేశంలో సొసైటీ ప్రధాన కార్యదర్శి ఫైసల్ అహ్మద్, సయ్యద్, అనురాగ్, రిత్విక్, ఖలీల్, అఫ్రోజ్ పాల్గొన్నారు.

పేకాటరాయుళ్లు అరెస్ట్

నవతెలంగాణ-బోథ్

మండలకేంద్రంలో మార్కండేయ గల్లీలో బహిరంగ ప్రదేశంలో ఐదుగురు వ్యక్తులు పేకాట ఆడుతున్నట్టు తమకు అందిన విశ్వసనీయ సమాచారం మేరకు పేకాట రాయుళ్లను పట్టుకున్నట్టు ఎస్సై ప్రవీణ్ తెలిపారు. వారి వద్ద నుంచి రూ.6వేల 9వందల నగదును, పేక ముక్కలు స్వాధీనపర్చుకొని, ఐదుగురిపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

కాన్షీరామ్ కలల రాజ్యాన్ని నిర్మిద్దాం



- ధర్మ సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షుడు అగ్గిమల్ల గణేష్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

బహుజన రాజ్య నిర్మాత కాన్షీరామ్ కలలుగన్న రాజ్యాన్ని నిర్మిద్దామని, బీసీ, ఎస్సీ, ఎస్టీ కులాలు ఏకమై ఆశయాల సాధనకు ఉద్యమించాలని ధర్మసమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షుడు అగ్గిమల్ల గణేష్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలో ధర్మ సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో కాన్షీరామ్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం నవంబర్ 3న హైదారాబాద్‌లో జరిగే డీఎస్పీ కార్యకర్తల మహా సమ్మేళన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అగ్గిమల్ల గణేష్ మాట్లాడుతూ ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలో పేదల రాజ్యం కోసం అట్టడుగు కులాలను ఏకం చేస్తూ మనువాద రాజకీయ కుట్రలకు ఎదురీడి పేదల రాజ్యాన్ని స్థాపించిన మహనీయుడు కాన్షీరామ్ అని కొనియాడారు. తెలంగాణలో మహాత్మా జ్యోతిరావు పూలే, డా.అంబేడ్కర్, సాహు మహారాజ్‌ల ఉద్యమాల స్పూర్తితో కాన్షిరామ్ ఉద్యమ ప్రేరణతో తెలంగాణలో ధర్మ సమాజ్ పార్టీ ధర్మ యుద్ధం చేస్తుందన్నారు. బహుజన జాతులు ఈ పోరాటంలో కలిసి రావాలని పిలుపునిచ్చారు. నవంబర్ 3న హైదారాబాద్‌లోని కేబీఆర్ గార్డెన్ లో ధర్మ సమాజ్ పార్టీ కార్యకర్తల మహాసమ్మేళనం సభ నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలోని మండల, గ్రామాల కార్యకర్తలు, అభిమానులు, పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ధర్మ సమాజ్ పార్టీ జిల్లా నాయకులు అగ్గిమల్ల గంగన్న, నవీన్ కుమార్, సాయి కుమార్, విను కుమార్, సతీష్ ఉన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన

నవతెలంగాణ-నార్నూర్

కేంద్ర ప్రభుత్వం గ్రామ పంచాయతీలో ప్రవేశ పెట్టిన పథకాలను అభివృద్ధి పనులను పరిశీలించడానికి ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసింది. ఈ సందర్భంగా బృందం సభ్యులు రఘునాథ్, నతరంజన్ గురువారం గాదిగూడ మండలంలోని అడ్‌మ్యాన్ గ్రామాన్ని సందర్శించి అభివృద్ధి పనులను పరిశీలించారు. కేంద్ర ప్రభుత్వ పథకాల్లు ఉపాధి హామీ పనులపై ఆరా తీశారు. వారి వెంట డీర్డీఓ కుటుంబ రావ్, ఏపీడీఓ కృష్ణరావ్, ఎంపీడీఓ శ్రీనివాస్, ఏపీఓ నితిన్, ఏపీఎం మాధవి, డీఈ లింగన్న, గోరఖ్‌నాథ్, టీఏలు, ఫీల్డ్ అసిస్టెంట్‌లున్నారు.

అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయండి



నవతెలంగాణ-ఉట్నూర్

ఖానాపూర్ నియోజకవర్గంలోని ఆదివాసీ గ్రామాలలో ఆదివాసులు ఘనంగా నిర్వహించే దండారి ఉత్సవాలకు నిధులు కేటాయించాలని ఎమ్మెల్యే వెడ్మబొజ్జు పటేల్ కోరారు. గురువారం ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డిని కలిసి నివేదికలు అందించారు. ఈ సందర్భంగా బీఎడ్ కళాశాలలో అధ్యాపకుల నియామకం, దండారి ఉత్సవాలు నిర్వహించే గ్రామాలలో షెడ్లు, నూతన రాయి సెంటర్ భవనాలు మంజూరు చేయాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న ఈజీఎస్ బిల్లులను వెంటనే మంజూరు చేయాలని విన్నవించారు. దీనిపై సీఎం సానుకూలంగా స్పందించారని ఎమ్మెల్యే తెలిపారు.

కల్యాణలక్ష్మీ చెక్కుల పంపిణీ

నవతెలంగాణ-తలమడుగు

మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో గురువారం బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన 15 మంది లబ్ధిదారులకు రూ.1లక్షా116 చొప్పున మొత్తం రూ.15,లక్షల1వేయి 740లను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనిల్ జాదవ్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను పక్కదోవ పట్టించడానికే కొత్త ప్రయత్నాలు చేస్తున్నారని అన్నారు. ప్రజలను మోసం చేయకుండా ఇచ్చిన హామీ నెరవేర్చాలని డిమాండ్ చేశారు. మహిళలు ఎప్పటికప్పుడు కల్యాణలక్ష్మీ చెక్కుతో పాటు తులం బంగారం అడుగుతున్నారని ప్రజల తరపున మళ్లీ కోరుతున్నామన్నారు. అనంతరం మండలంలోని కొత్తూరు గ్రామాల దుర్గామాతను దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ శేఖర్, డిప్యూటీ తహసీల్దారు ప్రభాకర్, మండల కన్వీనర్ తోట వెంకటేష్, ఆ పార్టీ నాయకులు కేదారేశ్వర్‌రెడ్డి, తిరుమలగౌడ్, ప్రీతమ్‌రెడ్డి, మేకల రవికాంత్ యాదవ్, మాజీ ఎంపీపీ దేవన్న, శ్రీనివాస్, ప్రకాష్‌రెడ్డి, అభిరామిరెడ్డి, నిమ్మల సుదర్శన్‌రెడ్డి, అబ్దుల్లా, కిరణ్ కుమార్, శ్రీనివాస్‌రెడ్డి, మాదూరి మల్లేష్, రంజిత్‌రెడ్డి, పల్లవి, సునీత, మండలాధికారులు బీఆర్ఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు.



ఆదివాసుల సాంప్రదాయ పూజలు

నవతెలంగాణ-నార్నూర్

దసరా పండగ సందర్భంగా గురువారం మండలంలోని బాబేఝరి గ్రామంలో ఆదివాసులు బార్ష అవ్వాల పెన్ సాంప్రదాయ పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మొక్కులు చెల్లించి దేవుని నైవేద్యాన్ని అర్పించారు. కార్యక్రమంలో బాబేఝరి గ్రామ పటేల్ మడావి లింగు, గుండాల పటేల్ మాన్కుతో పాటు నాయకులు ఆడా శ్రీరామ్, వివిధ గ్రామాల పటేళ్ళు, దేవారీలు పాల్గొన్నారు.